# తెలంగాణ కిరణం

శనివారం, అక్టోబర్ 12, 2024 | ప్రజల కోసం - మాఅక్షరం | సంపుటి : 16 సంచిక : 142 పేజీలు : 8

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, rangareddy, nizamabad, nalgonda


# విద్యార్థులకు దసరా కానుక

- తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపన
- షాద్‌నగర్‌లోని కొందుర్గులో సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- రాష్ట్రవ్యాప్తంగా 28 పాఠశాలలకు ఫౌండేషన్ స్టోన్






**హైదరాబాద్** దసరా వేళ తెలంగాణ విద్యార్థులకు రేవంత్ రెడ్డి సర్కార్ భారీ కానుకను ఇస్తోంది. గతంలో ప్రకటించినట్టుగానే శుక్రవారం (అక్టోబర్ 11న) తెలంగాణలోని ఆయా నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంకుస్థాన చేసారు ప్రభుత్వ పెద్దలు. మొదటి దశలో భాగంగా 28 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు శంఖుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగానే రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కోందుర్గులో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో విద్యాశాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. విద్యాశాఖ బలోపేతం కోసమే కొత్త నియామకాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఆందులో భాగంగానే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ప్రమోషన్లను చేపట్టామని తెలిపారు. మరోవైపు పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రణాళికలు రూపొందించామనన్నారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడం కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభిస్తున్నామని చెప్పుకొచ్చారు. 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్టు తెలిపారు. ప్రత్యేకంగా స్పోర్ట్స్ గ్రౌండ్ ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. మొత్తంగా 5 వేల కోట్ల రూపాయలతో ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టినట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మరోవైపు ఖమ్మం జిల్లా లక్ష్మీపురంలో నిర్మించబోతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భట్టి వివరించారు. కులమతాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేయటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లతో ప్రజల్లో మత సామరస్యం పెరుగుతుందన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు భోదన అందించేలా సకల సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. మరోవైపు పెద్దపల్లి జిల్లాలోని మంథని మండలంలో అడవి సోమన్ పల్లిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు మంత్రి శ్రీధర్ బాబు శంఖుస్థాపన చేశారు. యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమీకృత గురుకుల పాఠశాల భవనాలకు శ్రీకారం చుట్టినట్టు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య అందించటమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మార్పు తీసుకొస్తున్నామని రైతులకు రుణమాఫీ చేసి చూపించమని మంత్రి తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. మెగా డీఎస్సీతో పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేశినట్టు వివరించారు. పదేళ్లపాటు ఆగిపోయిన అభివృద్ధిని మళ్లీ ప్రారంభించామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# ఆ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లు బ్యాన్

- సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ మరో సంచలన నిర్ణయం
- హైదరాబాద్ చుట్టుపక్కల ఆక్రమిత జీపీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్ల నిషేధం
- సబ్ రిజిస్ట్రార్లకు సర్కారు ఆదేశాలు జారీ



**హైదరాబాద్** సంచలన నిర్ణయాలతో పాలనతో తనదైన మార్క్ క్రియేట్ చేస్తున్న రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చి అక్రమార్కుల గుండెల్లో బుల్డోజర్లు దింపుతున్న సర్కార్ ఇప్పుడు మరో సంచలన నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ చుట్టుపక్కల ఆక్రమిత గ్రామ పంచాయతీ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లపై నిషేధం విధిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అన్ని ఆక్రమిత గ్రామ పంచాయతీ లేఅవుట్‌లను నిషేధిత జాబితాలోకి చేర్చింది ఆయా ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. ఈమేరకు సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రణాళిక లేని వృద్ధిని నిరోధించడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. చాలా గ్రామ పంచాయతీ లేఅవుట్లలో రోడ్లు ఇరుకుంగా ఉండటంతో పాటు సెట్ బ్యాక్‌లు లేకుండా, డ్రైనేజీలు లేకుండా ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) అనధికార లేఅవుట్‌ల సర్వే నంబర్‌లను నిషేధిత జాబితా కింద బదిలీ చేయడంతో రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పలువురు సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన వస్తోంది. ఇబ్రహీంపట్నం ఆదిభట్లలోని జీపీ లేఅవుట్‌లో చట్టబద్ధతలను విస్మరించి 250 గజాల స్థలాన్ని కొనుగోలు చేసిన శ్రీనివాస్‌రెడ్డి వంటి మధ్యతరగతి కుటుంబాలకు ఈ సమస్య బాధ కలిగించింది. శ్రీనివాస్ రెడ్డి తన కుమార్తె వివాహంలో భాగంగా ప్లాట్‌ను తన అల్లుడికి బహుమతిగా ఇవ్వాలని భావించాడు. అయితే ప్లాట్‌ని నిషేధిత జాబితాలో చేర్చడం వలన దాన్ని వాళ్ల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకుండా ఆగిపోయింది. ప్లాట్ బహుమతిగా ఇవ్వాలనుకున్నానని కానీ ఇప్పుడు అది భారంగా మారిందని ఏం చేయాలో తెలియడం లేదంటూ బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. చట్టం ప్రకారం, లేఅవుట్‌లను మంజూరు చేసే అధికారం హెచ్ఎండిఏతో పాటు డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డిటీసిపి)కి మాత్రమే ఉంది. గ్రామ పంచాయతీలకు కాదు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) ఏర్పాటుకు ముందే ఈ జీపీ లేఅవుట్‌లలో చాలా వరకు అనుమతులు లభించాయి. అయితే చనిపోయిన సర్పంచ్‌లు, సిబ్బంది సంతకాల ఫోర్జరీతో ముందస్తు లేఅవుట్‌లు వేసినట్లు అధికారులు గుర్తించారు.

మీకు సంబంధించిన భూములు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయా.. లేవా.? అన్నది ఈ కింది లింకు క్లిక్ చేసి చెక్ చేసుకోండి. సాధారణంగా ప్రభుత్వ భూములు, వివాదాస్పద ఆస్తులు, మతపరమైన ట్రస్ట్ భూములు అనధికార రిజిస్ట్రేషన్లను నిరోధించడానికి 22-ఏ జాబితా కిందకు వస్తాయి. ఇటీవల ఈ జాబితాలోకి జీపీ లేఅవుట్‌లను చేర్చడంతో చాలా మంది భూయజమానులు తమ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నిషేధిత జాబితా నుంచి తమ ఆస్తులను తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. మరి ప్రభుత్వం తీసుకున్న ఈ కీలక నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో వేచి చూడాలి.

## జీఎస్టీ స్కాంపై
# ఈడీ కేసు నమోదు

- మాజీ సీఎస్ సోమేష్‌కు మరిన్ని చిక్కులు




**హైదరాబాద్** తెలంగాణలో వెలుగు చూసిన ఐజీఎస్టీ స్కాంలో ఈడీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ఏ1గా వాణిజ్య పన్నుల అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు, ఏ2గా ఉప కమిషనర్ శివరామ్ ప్రసాద్, ఏ3గా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్ బాబు, ఏ4గా ప్లియంటో టెక్నాలజీస్, ఏ 5గా మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ ను సీసీఎస్ పోలీసన్నులు నమోదు చేశారు. ఇందులో అక్రమ నగదు చెలామణి జరిగినట్లుగా తేల్చడంతో ఈడీ కేసు పెట్టింది. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కి సంబంధించి రూ.1400 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు, దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్లు సీసీఎస్ పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బోగస్ ఇన్వాయిస్‌లను సృష్టించి, పెద్ద ఎత్తున ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ను క్లెయిమ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ గత ఏడాది చివర్లో నిర్వహించిన ఆడిట్‌లో గుర్తించింది. ఈ కేసులో వస్తువులు సరఫరా చేయకపోయినా బోగస్ ఇన్వాయిస్ లను సృష్టించారని అధికారులు గుర్తించారు. ఇది వందల కోట్ల వ్యవహారం కాదని, మొత్తం స్కామ్ రూ.వేల కోట్లలో ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి సమగ్ర దర్యాప్తు కోసం సీఐడీకి అప్పగించింది. సోమేశ్‌కుమార్ ఆదేశాలతోనే తాము సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేందుకు అంగీకరించామని నిందితులుగా ఉన్న కాశీవిశ్వేశ్వరరావు, శివరామప్రసాద్ అంగీకరించినట్లు సీసీఎస్ పోలీసులు గతంలో తెలిపారు. ఈ ఇద్దరు అధికారులతో పాటు సోమేశ్‌కుమార్ 'స్పెషల్ ఇనిషియేటివ్స్' పేరిట ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకుని సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకునేవారని సీసీఎస్ పోలీసులు దర్యాప్తులో తేల్చారు. సోమేష్ సహకారంతో 75 సంస్థలకు సంబంధించిన ఐటీ రిటర్నుల సమాచారం తెలియకుండా

2లో..

# రూ.40000 కోట్లతో "ప్రాజెక్టు-77"

- విశాఖపట్నానికే ఆ ఛాన్స్



**విశాఖపట్నం** ఏపీ ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి పెట్టుబడులు తరలివస్తున్నాయి. విశాఖలో లులు మాల్, మల్టీప్లెక్స్ ఏర్పాటు చేస్తామని లులు గ్రూప్ ఇప్పటికే ప్రకటించింది. అటు టీసీఎస్ సైతం విశాఖపట్నానికి తరలిరానున్నట్లు ఏపీ ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ ఇటీవల వెల్లడించారు. ఇప్పుడు విశాఖను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే విధంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా అణుశక్తితో దాడి చేయగలిగే రెండు జలాంతర్గాములను దేశీయంగా అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుతో పాటుగా 31 ఆయుధాలతో కూడిన ఎంక్యూ-9బి ప్రిడేటర్ డ్రోన్‌లను అమెరికా నుంచి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ ఇందుకు ఆమోదం తెలిపింది. చైనా దూకుడు కళ్లెం వేయడానికి న్యూక్లియర్ పవర్డ్ అటాక్ సబ్ మెరైన్లు ఉండాలని కేంద్రం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వీటిని దేశీయంగా తయారు చేయాలని భావిస్తోంది. ఇక ఈ ప్రాజెక్టుకు.. ప్రాజెక్ట్ -77గా నామకరణం చేశారు. రూ.40000 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అయితే సుదీర్ఘకాలంగా దీనికి ఆమోదం లభించలేదు. అయితే ఇటీవల జరిగిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఆమోదం లభించింది. ప్రాజెక్ట్ -77లో భాగంగా అణుశక్తితో దాడి

2లో..

# తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం

- మైసూర్ నుంచి బిహార్‌లో దర్భంగాకు వెళ్తోన్న రైలు
- తిరువల్లూర్ జిల్లా సమీపంలో గూడ్సును ఢీకొట్టిన ఎక్స్‌ప్రెస్
- ప్రమాదంలో పట్టాలు తప్పిన నాలుగు ఏసీ కోచ్‌లు



**చెన్నై** తమిళనాడులో శుక్రవారం రాత్రి ఘోర రైలు ప్రమాదం సంభవించింది. తిరువల్లూరు జిల్లాలో గూడ్సు రైలును ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలు భోగీలు పట్టాలు తప్పగా నాలుగు ఏసీ కోచ్‌ల్లో మంటలు చెలరేగాయి. రైలు నెంబరు 12578 మైసూరు-దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ చెన్నై సమీపంలోని కావరాయ్‌పెట్టాయ్ స్టేషన్ వద్ద ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొట్టినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి 8.50 గంటలకు చోటుచేసుకుందని తెలిపారు. ప్రమాదం గురించి

2లో..

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి కీలక ముందడుగు

- ఉత్తర్వులు జారీ




**హైదరాబాద్** దసరా పండుగ వేళ తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో తీపికబురు వినిపించింది. తెలంగాణలో నిరుపేదలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో మరో కీలక ముందడుగు పడింది. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రారంభిస్తామంటూ మంత్రులు చాలా రోజులుగా చెప్తూ వస్తుండగా ప్రజల్లో ఓ ఉత్కంఠ నెలకొంది. అయితే ఆ ఉత్కంఠకు తెరదించుతూ కీలక నిర్ణయం తీసుకుంది ప్రభుత్వం. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు అవసరమైన విధివిధానాలను ప్రకటించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమైంది. త్వరలోనే అర్హులను కూడా ఎంపిక చేసి వారికి మంజూరు పత్రాలను ఇవ్వాలని యోచిస్తోంది. అయితే ఈ పథకాన్ని పకడ్బంధీగా అమలు చేసేందుకు గానూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో

2లో..

# వైభవంగా సాగిన ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచాలన్ విజయదశమి ఉత్సవము

- రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గ్లోబల్ స్కోప్ ఉన్న దేశవ్యాప్త సంస్థ
- మాతృభూమి సేవ కోసం పని చేసే ఏకైక సంస్థ ఆర్ ఎస్ ఎస్
- స్వచ్ఛంద సేవకుల త్యాగం, తపస్సు, అంకిత భావంతో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రయాణం
- విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి







**కరీంనగర్, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేకరి):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 99 సంవత్సరాలు పూర్తి చేసుకొని 100వ సంవత్సరం లోకి అడుగుడుతున్న సందర్భంలో ఆర్ ఎస్ ఎస్ కరీంనగర్ శాఖ పథ సంచలన్ (రూట్ మార్చ్) కార్యక్రమాన్ని, విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించింది. కరీంనగర్ పట్టణం జ్యోతి నగర్ లోని సెంట్ ఆల్ఫోన్స్ హైస్కూల్లో జరిగిన విజయదశమి ఉత్సవ ప్రోగ్రాంకు ముఖ్య వక్త హాజరైన విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్ది లోకి అడుగుపెడుతున్న విశేష శుభ సందర్భమిదన్నారు. మాతృభూమి సేవ కోసం ఉద్భవించిన సంస్థ ఆర్ ఎస్ ఎస్ అని, గ్లోబల్ స్కోప్ ఉన్న ఏకైక జాతీయవాద సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ అన్నారు. దేశం కోసం సమాజం కోసం స్వయం సేవకుల స్వచ్ఛంద త్యాగం, తపస్సు, అంకిత భావంతో ఆర్ఎస్ఎస్ వందేళ్ళ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగించిందన్నారు. డాక్టర్ జి విజయదశమి రోజున ఆర్ఎస్ ఎస్ ను నాగపూర్ లో స్థాపించడం జరిగిందని, పదిమంది చిన్నపిల్లలతో ప్రారంభమైన ఆర్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా శాకోప శాఖలుగా విస్తరించి, నేడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ క్రమశిక్షణ కలిగిన ఆర్గనైజేషన్ అని, సంఘ కార్య పద్ధతి, విశేషతలతో ప్రస్తుతం ఈ స్థాయికి వచ్చిందన్నారు. ముఖ్యంగా సంఘ కార్య పద్ధతిలో ప్రధానమైనది మూలమైనది శాఖ అని, దీన్ని వికసింప చేయడానికి బైటక్ , అభ్యాస వర్గ, సాంఘిక్ లు తోడ్పడుతాయన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన సంక్షేమ ట్రస్టు ట్రస్ట్ బల్మూరి కర్ణాకర్ రావులు మాట్లాడారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు డాక్టర్ రమణాచారి , జిల్లా సంఘచాలక్ నిరంజన చారి , హన్మండ్ల శ్రీనివాస్ రెడ్డి లతోపాటు స్వయం సేవకులు పాల్గొన్నారు

# జీఎస్టీ స్కాంపై ఈడీ కేసు నమోదు

చేసేందుకు సాఫ్ట్ వేర్ ను మార్చారు. తద్వారా ఐటీసీ క్లెయిమ్‌లకు వీలు కల్పించి రూ.1400 కోట్ల వరకు ఐటీసీ సొమ్మును అడ్డదారుల్లో క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశంకల్పించారు. ఒక్క తెలంగాణ బేవరెజెస్ కార్పొరేషన్‌కు సంబంధించినదే రూ.1000 కోట్ల వరకు ఐటీసీని క్లెయిమ్ చేసినట్లు గుర్తించారు. మరో 11 సంస్థలకు సంబంధించి రూ.400 కోట్ల ఐటీసీ సొమ్మును క్లెయిమ్ చేసినట్లు తేలిననట్లగా తెలుస్తోంది. కుంభకోణం మొత్తం సోమేశ్‌కుమార్ కనుసన్నల్లోనే నడిచినట్లు దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. సోమేశ్ కుమార్ తో పాటు మరో ముగ్గురు అధికారులకు సీఐడీ అధికారులు ఇప్పటికే నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు ఈడీ కూడా కేసు నమోదు చేసింది.

# రూ.40000 కోట్లతో "ప్రాజెక్టు-77"

చేయగలిగే రెండు జలాంతర్గాములను అభివృద్ధి చేయనున్నారు. నౌకాదళ పరిభాషలో వీటిని ఎస్ఎస్ఎన్ అని పిలుస్తారు. ఇక ఇందులో క్షిపణులు, టార్పెడోలు, ఇతరత్రా ఆయుధాలు కూడా ఉంటాయి. అయితే ఇంతటి ప్రతిష్టాత్మకమైన ఈ రూ.40000 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం విశాఖపట్నాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. విశాఖలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఈ జలాంతర్గాములను తయారు చేయనున్నట్లు సమాచారం. అయితే మొదటి జలాంతర్గామిని తయారు చేయడానికే 10 నుంచి 12 ఏళ్లు పడుతుందని అంచనా. రెండు ఎస్ఎస్ఎన్లు 95 శాతం దేశీయంగా తయారుకానున్నట్లు సమాచారం. కొన్ని డిజైన్ కన్సల్టెన్సీ కోసం మాత్రమే విదేశీ సహాయం తీసుకుంటామని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా స్థానికంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఉపయోగం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

# తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం

సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ దళాలు అక్కడకు చేరుకున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా? అనేది మాత్రం తెలియరాలేదు. ప్రమాదం గురించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఈ ఘటనతో నెల్లూరు-చెన్నై మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. చెన్నై నుంచి ఢిల్లీకి వెళ్లాల్సిన తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలును రద్దుచేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడినట్టు సమాచారం. వారిని చికిత్స కోసం సమీపంలోని ఆస్పత్రికి తరలించినట్టు తెలుస్తోంది. మొత్తం 12 బోగీలు పట్టాలు తప్పినట్టు తెలుస్తోంది. వీటిలో నాలుగు ఏసీ కోచ్‌లు, రెండు అన్-రిజర్వుడ్ కోచ్‌లు ఉన్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాద సమాచారం కోసం దక్షిణ రైల్వే చెన్నైలో హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేసింది. సిగ్నలింగ్ లోపం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం మైసూర్ దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు సిగ్నల్ లోపం వల్ల మెయిన్ రూట్ నుంచి లూప్ లైన్‌లోకి వెళ్లి ఆగి ఉన్న గూడ్సును ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా కుదుపునకు గురై పలు బోగీలు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలికి డీఆర్ఎం, ఉన్నతాధికారులు బయలుదేరారు. ముందుజాగ్రత్త చర్యగా అంబులెన్స్‌లను అధికారులు సిద్ధం చేశారు. మంటలు అంటుకున్న బోగీల్లో ఉన్నవారిని సిబ్బంది బయటకు తీసుకొచ్చారు. కాగా, ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస రైలు ప్రమాదాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది ఒడిశాలోని బాలేశ్వర్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో 300 మంది ప్రాణాలు కోల్పోగా వందల మంది గాయపడ్డారు. బాలేశ్వర్ వద్ద మెయిన్ లైన్ నుంచి లూప్‌లైన్‌లోకి వచ్చిన కోరమాండల్ సూపర్‌ఫాస్ట్ అక్కడ ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొట్టగా ఆ సమయంలో ఆ మార్గంలో వస్తోన్న హౌరా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొట్టింది.

# అమెరికాలో తగ్గిన కొలువులు..

**న్యూఢిల్లీ,** డిగ్రీవరకు భారత్‌లో చదివి.. ఉన్నత చదువుల అబ్రాడ్‌లో చదవాలి.. మత పిల్లలు జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడాలి.. ఇదీ నేటితరం తల్లిదండ్రుల ఆలోచన. ఇక చదివితే అబ్రాడ్‌లోనే చదవాలి.. అక్కడే కొలువు కొట్టాలి. అక్కడే స్థిరపడాలి. అక్కడి సొమ్ముతో భారత్‌లో పెట్టుబడులు పెట్టాలి. ఇదీ నేటితరం యువతరం ఆలోచన. దీనిని నెరవేర్చుకునేందుకు యువత చాలా కష్టపడుతోంది. ఇక తల్లిదండ్రుల కూడా పిల్లల డాలర్ డ్రీమ్ నెరవేర్చేందుకు ఆదాయం కూడబెడుతున్నారు. అప్పో సప్పో చేసి ఉన్నత చదువులు చదివిపిస్తున్నారు. అన్నీ కుదిరితే అబ్రాడ్‌కు పంపుతున్నారు. కరోనా ముందు వరకు అబ్రాడ్ చదువులు బాగానే సాగాయి. చదువు పేరుతో వెళున్న చాలా మంది అక్కడ చదువుతూనే సంపాదించడం అలవాటు చేసుకుంటున్నారు. ఇక్కడ చిన్నచిన్న పనులు చేయడానికి మొహమాటపడేవారు. అక్కడ షాప్ కీపర్లుగా, పెట్రోల్ బంకుల్లో, డెలివరీ బాయిస్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి అక్కడ ఏం చేసినా గౌరవంగానే ఉంటుంది. అందుకే చాలా మంది అమెరికాతోపాటు యూకే, కెనడా, జర్మని, ఫ్రాన్స్, రష్యా బాట పడుతున్నారు. చదువు కాస్త తక్కువగా ఉన్నవారు గల్ఫ్ దేశాలకు కూలీలుగా వెళ్తున్నారు. కరోనా తర్వాత ఆర్థిక మాంద్యం, వర్క్‌ఫ్రం హోం కల్చర్ పెరగడంతో చాలా కంపెనీలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో ఉద్యోగాల్లో కోత విధిస్తున్నాయి.అమెరికాలో ఉద్యోగాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. పెద్దపెద్ద కంపెనీలు ఇప్పటికే ఉన్న కొలువులను కోత విధిస్తున్నాయి. ఇక కొత్త ఉద్యోగాల సంగతి అంతే. పార్ట్‌టైం జాబులు కూడా దొరకడం లేద. దీంతో విద్యార్థులు ఇప్పుడు అమెరికా కన్నా.. యూకే, కెనడా, జపాన్, జర్మనీ, ఆస్ట్రేలియా వెళ్తున్నారు. అక్కడ కూడా ఆ దేశఋూలకూ వలసలు పెరగడం కారణంగా ఆయా దేశాలు కూడా నిబంధనలు కఠినతరం చేస్తున్నాయి. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విదేశాల్లో కొలువు కల చెదురుతోంది.ఇక విదేశాల్లో ఉద్యోగుల సంక్షోభం ఎలా ఉందో చూస్తే విదేశాలకు వెళ్లాలనే ఆందోళన పెరుగుతోంది. తాజాగా కెనడాలో ఒక సూపర్‌వైజర్ పోస్టుకు ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారట. దీని కోసం 3 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భారతీయులే 1,800 మంది వరకు ఉండడం గమనార్హం. నిరుద్యోగ రేటుకు నిదర్శనం. అక్కడే సంపాదించి, అక్కడి ఖర్చులు తీర్చుకోవానుకునేవారు ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ తల్లిదండ్రులపై ఆధారపడుతున్నారు. చదువుకునే సమయంలో అవకాశాలు లేక ఆందోళన చెందుతున్నారు. మరోవైపు కెనడా, ఆస్ట్రేలియా విధించిన ఆంక్షలు, పెంచిన అద్దెలు భరించలేక స్వదేశానికి వస్తున్నారు.

# మైసూరుకు దసరా శోభ

**బెంగళూరు :** ఈసారి దసరాకు మైసూరు వెళ్లారా..? లైఫ్‌టైమ్‌లో ఒక్కసారైనా దసరా పండగను మైసూర్లో చూడాల్సిందే. మైసూరుకెళ్లి దసరాను సెలబ్రేట్ చేసుకున్న ప్రతీవాళ్లూ చెప్పే మాటే ఇది. ఎందుకంటే మైసూర్ అంటే దసరా.. దసరా అంటేనే మైసూరు.. మైసూరులో జరిగే శరన్నవరాత్రులు.. చూడ్డానికి రెండు కళ్లూ సరిపోనంత గొప్ప సంబరం అది. 400 ఏళ్లకు పైగా చరిత్రున్న మహా వేడుక అది..పదిమంది కూడితే పండగ. వందలు-వేలమంది కలగలిస్తే అది ఉత్సవం. మరి.. లక్షల మంది ఒక్కచోట చేరి సంబరమాడితే.. అది మహోత్సవం. దేశమంతటా దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.

అవన్నీ ఒక ఎత్తయితే.. మైసూరులో జరిగే దసరా ఉత్సవం.. రాయల్ ఫెస్టివల్ ఒక్కటీ ఒక ఎత్తు..జోష్ అన్‌లిమిటెడ్.. జాయ్ అన్‌లిమిటెడ్.. సెలబ్రేషన్ అన్‌లిమిటెడ్.. మస్తీ అన్‌లిమిటెడ్. ట్రెడిషనల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కి పర్‌ఫెక్ట్ కేరాఫ్ ఏదంటే ఇంకేంటి మైసూరు దసరానే. ఎందుకంటే.. 400 ఏళ్ల నుంచీ కంటిన్యూ ఔతున్నా వన్నె తగ్గని మహా సంప్రదాయం ఇది..కన్నడ నాట నాద హబ్బ.. అంటే రాష్ట్ర పండుగ. దసరా ఉత్సవాలకు అక్కడ జనం ప్రభంజనంలా కదులుతుంది. అన్ని ఊర్లూ మైసూరు వైపే దారితీస్తాయి. నాటోన్లీ కర్నాటక.. దక్షిణాది ఉత్తరాది ఏకమై.. దేశం యావత్తూ మైసూరు దసరా కోసం కళ్లింత చేసుకుని ఎదురుచూస్తుంది. విజయదశమి నాటికి లక్షలమంది జనంలో కిక్కిరిసిపోతుంది మైసూర్ మహా నగరం..మైసూర్ దసరా ఉత్సవాల క్యాలెండర్ కూడా ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించాలి.

2024 దసరా వేడుక అక్టోబర్ 3 ఉదయం 9 గంటలా 15 నిమిషాలకు మొదలై 12వ తేదీ శనివారం అర్ధరాత్రి దాకా కొనసాగుతుంది. చాముండి హిల్స్‌లోని చాముండేశ్వరి ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయి.గత ఏడాది రాష్ట్రంలో కరువు పరిస్థితి ఏర్పడ్డా.. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు బాగా కురవడంతో రైతాంగం కుదుటపడింది. అందుకే.. ఈ ఏడాది దసరా వేడుకల్ని మునుపటి కంటే ఘనంగా నిర్వహించాలని ప్లాన్ చేసింది కన్నడ సర్కార్. నెలరోజుల ముందునుంచే రిహార్సల్స్ మొదలౌతాయి. మైసూరు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబౌతుంది. దాదాపు సగం పోలీసు ఫోర్స్ మైసూర్ మహోత్సవ్ మీదే ఫోకస్. సీఎం సిద్ధరామయ్య రెండుసార్లు సన్నాహక సమావేశం నిర్వహించి.. మైసూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రిని అలర్ట్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులే ఉంటాయంటే అర్థం చేసుకోవచ్చు మైసూర్ దసరా కన్నడ సర్కారుకు ఎంతటి ప్రతిష్టాత్మకమో.

# లారీ దగ్ధం.. డ్రైవర్ సురక్షితం

**నల్గొండ** నల్లగొండ జిల్లా చిట్యాల శివారులో.. హైదరాబాద్-విజయవాడ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక లారీ అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. దాంతో లారీ డీజిల్ ట్యాంక్ పగిలింది. క్షణాల్లో మంటల్లో సిమెంట్ లోడ్ లారీ దహనమయింది. కాలిపోతున్న లారీ నుంచి డ్రైవర్ బయటికి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. లారీ డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం అని అనుమానిస్తున్నారు. ఘటనతో హైదరాబాద్ -విజయవాడ హైవే పై ట్రాఫిక్ స్థంభించింది.

# విశాఖలో బెంగాలీల దసరా సందడి

**విశాఖపట్నం** విశాఖలో ధునిచి నృత్యం తో బెంగా లీలు పూజలు నిర్వహిం చి ఆహ్లా దభరిత వాతావరణంలో సందడి చేశారు. విశాఖలో ఉంటున్న బెంగా లీలతో పాటు ఇతర రాష్ట్రా నికి వచ్చిన బెంగాలీలు కూడా దస రా వేడుకలు అంగరంగ వైభవంగా జరుపున్నారు. దసరాలో దుర్గమ్మ పూజ అంటే బెంగాలీకు స్పెషల్. ప్రపంచం నలుమూల నుండి ఒకే చోట చేరి కుటుంబం అంతా కలిసి ఈ దసరా పండుగ అమ్మవారు వద్దపూజలు జరుపుకుంటారు. సరదాగా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. ముఖ్యం గా ఉత్సవాల్లో వారి నృత్యాలు ఈ వేడుకలకు హైలెట్ గా నిలుస్తాయి. దుర్గమ్మ పూజ అంటే బెంగాలీలు ధునిచి నృత్యం అనాదిగా వస్తున్న ఆచారం అని నిర్వాహకులు అంటు న్నారు. సాంప్రదాయం వస్త్రాలు కుర్తాలు చీరలు ధరించి , పురుష లు స్త్రీలు కలిసి డాక్ శబ్దంతో ఈ నృత్యం చేయడం సంప్రదాయంగా కొనసాగుతోంది.ఈ సారి కూడా ధూమ్ ధామ్ గా వేడుకలు నిర్వ హించి వారి భక్తిని చాటుకున్నారు.

## పురాతన కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉత్సవాలు

**విశాఖపట్నం** విశాఖ ఓల్డ్ టౌన్ లో కురుపాం మార్కెట్ ప్రాంతంలో గల 147 సంవత్సరాల పురాతన కన్య కాపరమేశ్వరి అమ్మవారి ఆలయం లో శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మ వారిని శ్రీమహాలక్ష్మి రూపంలో అలం కరణ చేసి భక్తులకు దర్శనం కలి గిం చినట్లు దేవస్థాన పురోహితులు తెలిపారు.తెల్లవారుజామున అమ్మ వారి మూలవిరాట్ కు పాలు, పెరు గు, గంధం, తేనె వంటి 108 రకాల ద్రవ్యములు మరియు వివిధ రకాల పండ్ల రసములతో ప్రత్యేక అభిషే కం చేసి అమ్మవారిని వివిధ రకాల పూలతో సుందరంగా శ్రీమహాలక్ష్మి రూపంలో అలంకరించి స్వర్ణ వస్త్రాలతో అలకరించి , 108 స్వర్ణపుష్పములతో నివేదన గావిం చారు.ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో సుమారు ఆరు కేజీల స్వర్ణభరణములు, బంగారు చీర, బంగారు కిరీటం, బంగారు బిస్కెట్లు మరియు పది కేజీల వెండి వస్తువు లు వెండి బిస్కెట్లు తో పాటు నాలు గు కోట్ల విలువ చేసే భారతీయ కరెన్సీతో తీర్చి దిద్దారు.గర్భగుడి మొత్తం ధనాగారం గా మార్చివేసిన వైనం భక్తులను ఆకట్టుకుంది.గత 22 సంవత్సరముల నుంచి శరన్న వరాత్రి ఉత్సవాల సమయంలో అమ్మవారిని మహాలక్ష్మి అవతార రూపంలో కరెన్సీ నోట్లు, బంగారు మరియు వెండి ఆభరణాలతో అలంకరణ చేయడం జరుగుతుం దని పురోహితులు చెపుతున్నారు.

# హైదరాబాద్ వ్యర్థం... నల్గొండ తీర్థం

## - మూసి బచావో అంటున్న నల్గొండ వాసులు

**హైదరాబాద్ :** అనంతగిరి కొండలు అరుదైన వనమూలికల సంపదతో తలతూగుతున్నాయి. అక్కడి గాలి పీల్చితే చాలు రోగాలన్నీ మాయమవుతాయని ఎంతోమంది నమ్మకం. ఆ వనమూలికల కొండల్లోనే మూసీ నదిపుట్టింది. అక్కడినుంచి దాదాపు 240 కిలోమీటర్లు ప్రయాణించి నల్లగొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఆ నీరు తాగేందుకు ఎంతో విశిష్టమైనదిగా భావించేవారు. కానీ, నేడు మూసీ నది అంటేనే మురికి నీరుగా మారిపోయింది. ఇక ఈ నీరు తాగేందుకు కాదు కదా కనీసం పంటపొలాలకు కూడా వాడటం ప్రమాదకరంగా మారుతున్నది. నల్లగొండ మీదుగా ప్రవహించే మూసీ నదిలోకి నీళ్లు వచ్చాయంటే.. ఆ పరివాహక ప్రాంత రైతులకు ఆందోళన మొదలవుతుంది. ఆ నది ఎన్ని రసాయన వ్యర్థాలను తీసుకువచ్చిందో.. ఆ నీటితో తమ పంటలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లుతుందోనని భయపడుతారు. దాదాపు 40 ఏళ్ల ముందువరకు మూసీ నది నీటిని తాగునీటికి వాడుకున్న నల్లగొండ జిల్లావాసులు ఇప్పుడు విషంలా మారిన నదిని చూసి బాధపడుతున్నారు. ప్రభుత్వం మూసీ నది ప్రక్షాళన నడుం బిగించడంపై పరివాహక రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మూసీ బచావ్ అంటూ ఎలుగెత్తి నినదిస్తున్నారుఒకనాడు మూసీ నదిని అదృష్టంగా భావించిన ప్రజలే.. ఇప్పుడు ఆ నది పేరెత్తితే భయపడుతున్నారు. 1980 ప్రాంతంలో హైదరాబాదు నగరం శివార్లలోని పారిశ్రామిక ప్రాంతాలలో వెలువడిన వ్యర్థపదార్థాలను మూసీ నదికి జత చేసి చిన్నచిన్న నాలాల్లో వదలడంతో నీటి కాలుష్యం మొదలైంది. గణనీయంగా పెరిగిపోయిన జనాభాతో నగరంలోని మురికి నీటిని మూసీ నదిలోకి వదలడంతో ఆ నది మురికి కూపంగా మారింది. ప్రతిరోజు జంట నగరాల నుంచి కొన్నేళ్ల క్రితం వరకు దాదాపు 350 మిలియన్ లీటర్ల మురికి నీరు కలిసేది. కానీ ఇప్పుడు క్రమంగా 1,625 మిలియన్ మీటర్లకు చేరుకుందని తెలుస్తున్నది. మూసీ నది పరివాహ ప్రాంతం వెంట సుమారు 12 వేలకు పైగా పరిశ్రమలు ఉన్నాయి. కేవలం జీడిమెట్ల ప్రాంతం నుంచే వెయ్యి మిలియన్ లీటర్ల మురికి నీరు మూసీలోకి వస్తున్నదని సమాచారం. అనేక ఫార్మా కంపెనీల నుంచి వస్తున్న విషపు నీరు.. మందుల తయారీ నుంచి వచ్చిన సూపర్ బగ్స్ ఎక్కువ నీటిని కాలుష్యం చేస్తున్నాయి. నాచారం పారిశ్రామిక ప్రాంతంలో పెద్ద చెరువు పటేల్ చెరువులో శుభ్రపరచిన నీటిని పరిశ్రమల్లో యంత్రాలను చల్లబరిచేందుకు.. కడిగేందుకు వినియోగిస్తున్నారు. దీనికితోడు ఇంటి వ్యర్థాలు రసాయనాలతో కూడిన డిటర్జెంట్ మురికి నీరు కూడా మూసీలో కలుస్తున్నది.ప్రపంచవ్యాప్తంగా కాలుష్యంపై 14 దేశాలలోని 240 నదులపై శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలో భయంకరమైన విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రపంచంలోని నదుల్లో అత్యంత కాలుష్యాన్ని వెదజల్లే నదుల్లో మూసీ 22వ స్థానంలో ఉంది. ఈ నది నీళ్లలో కెమికల్స్ విపరీతంగా పేరుకుపోయాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ నీటిలో 48 రకాల క్రియాశీలక ఔషధ పదార్థాల ఆనవాళ్లు ఉన్నాయని గుర్తించారు. యాంటీబయాటిక్స్(బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల నివారణకు వాడే మందులు) యాంటీ డిప్రెసెంట్లుకూడా ఎక్కువ మోతాదులో ఉన్నాయని వెల్లడించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం భూగర్భ జలాలు మెడిసిన్‌తో సమానమని., అంతే దాని అర్థం రోగం లేకపోయినా మందులు వేసుకున్నట్లేనని చెప్పారు. ఫలితంగా అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు మందులు వేసుకున్నా.. అవి పని చేయవని కొత్త రోగాలు రావడం ఖాయమని సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు.మూసీ నది మొత్తం ఫార్మా డంపింగ్‌గా మారిపోయింది. ఈ పరివాహక ప్రాంతంలో సుమారు 70 కిలోమీటర్ల

# ఇందిరమ్మ ఇళ్ల పంపిణీకి కీలక ముందడుగు

ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని భావించిన సర్కారు అందుకు సంబంధించిన జీవో జారీ చేసింది. ఈ మేరకు అధికారులకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది.అయితే ఈ గ్రామ కమిటీలో గ్రామ సర్పంచ్ ఛైర్మన్‌గా ఏడుగురు సభ్యులుండగా కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి వ్యవహరిస్తారు. ఈ ఏడుగురు సభ్యుల్లో మహిళ సంఘాల నుంచి ఇద్దరు ఉండనుండగా ఎస్సీ, బీసీ సభ్యులు ఉండేలా జాగ్రత్త పడాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. ఇక మున్సిపాలిటీ స్థాయిలోని కమిటీల్లో కౌన్సిలర్, కార్పొరేటర్, ఛైర్మన్ ఉంటారు. అయితే ఈ కమిటీలు అర్హులను ఎంపిక చేసే ప్రక్రియలో స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాయి. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాయి. అయితే శనివారం నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కమిటీల్లో ఉండే సభ్యుల కోసం పేర్లు పంపించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను సర్కారు ఆదేశించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ముందుకెళ్తోంది. అయితే ఇప్పటికే ఆరు గ్యారెంటీల్లో ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత కరెంటు, గ్యాస్ సబ్సీటీ, రైతు రుణమాఫీ లాంటి పథకాలను అమలు చేస్తుండగా రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ లాంటి ప్రతిష్టాత్మకైన పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు సర్కార్ కసరత్తు చేస్తోంది. గతం ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయగా చాలా వరకు ఇండ్లు నిర్మాణ దశలోనే ఉండటంతో ఆ పథకం పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ఇచ్చిన వాటిలోనూ పైరవీలు నడిచాయన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే ఈసారి మాత్రం ఎలాంటి పైరవీలకు తావు లేకుండా అర్హులైనవారికి మాత్రమే ఇండ్లు అందించాలని ప్రభుత్వం యోచిస్తుంది. అందులో భాగంగానే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయనుంది.

# పీకల్లోతు కష్టాల్లో కర్ణాటక కాంగ్రెస్

**బెంగళూరు :** కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న మూడు రాష్ట్రాల్లో కర్ణాటక ఒకటి. ఆ పార్టీకి కాస్త ధైర్యం ఇచ్చిన రాష్ట్రం కర్ణాటక. తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అనేక సమస్యలు చుట్టుముడుతున్నాయి. ముందుగా రాజును బలహీనం చేస్తున్న బీజేపీ.. తర్వాత సైన్యాధిపతులను టార్గెట్ చేస్తూ వస్తోంది. సిద్ధరామయ్య ముడా స్కాంలో ఇరుక్కున్నారు. ఆ స్థలాలన్నీ వెనక్కి ఇచ్చేసి బయటపడాలని అనుకుంటున్నారు కానీ.. రాజకీయ దుమారం ఆగేలా లేదు. పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. అదే సమయంలో సీఎం మార్పు ఖాయమంటూ సొంత పార్టీలోనే ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో హనీ ట్రాప్ అంశంపై కూడా తెరపైకి వచ్చింది. సీఎం సిద్దరామయ్యపై లోకాయుక్త విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌కు కష్టాలు ప్రారంభమయ్యాయి. అది రోజు రోజుకు పెను వివాదంగామారింది. చివరికి ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఆయన తనను తాను కాపాడుకునే పరిస్థితుల్లో ఉండటంతో మరో వైపు బీజేపీ ఆపరేషన్ కమల్ ప్రారంభించిందన్న ప్రచారం ఊపందుకుంది. ముఖ్యంగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఓ సారి ఢిల్లీ వెళ్లినప్పుడు బీజేపీ పెద్దల్ని కలిసినట్లుగా ప్రచారం జరిగింది. దీనిపై విస్తృత ప్రచారం జరగడంతో ఎందుకు కలవాల్సి వచ్చిందో వివరణ ఇవ్వడానికి రాహుల్ గాంధీ అమెరికాలో పర్యటిస్తూంటే అక్కడికి వెళ్లారు. ఆ తర్వాత పరిస్థితులు సద్దుమణిగినట్లుగా ఉన్నా.. నివురుగప్పిన నిప్పులానే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు జరుపుతున్న సీక్రెట్ సమావేశాలతో వెల్లడవుతూనే ఉంది. కర్ణాటక రాజకీయాల్లో హనీ ట్రాప్‌కు ప్రత్యేకమైన పాత్ర ఉంటుంది. గతంలో కాంగ్రెస్, జేడీఎస్ ప్రభుత్వం కుప్పకూలిపోవడానికి ఈ హనీ ట్రాపే కారణం. సీనియర్ మంత్రి ఒకరు ఇలాంటి ట్రాప్ లో ఇరుక్కుని రాజీనామా చేయాల్సి వచ్చింది. తర్వాత చాలా సీడీలు ఉన్నాయని ప్రచారం జరిగినా చివరికి ఏవీ బయటకు రాలేదు. కానీ ఎమ్మెల్యేలు మాత్రం పార్టీ మారిపోయారు. ప్రభుత్వం మారిపోయింది. ఇప్పుడు మరో మహిళ బెంగళూరులో ప్రెస్ మీట్ పెట్టి ఇద్దరు ముఖ్య నేతలు హనీ ట్రాప్‌లో ఇరుక్కున్నారని బీజేపీ నేతలు రక్షణ కల్పిస్తామని హామీ ఇస్తే వారికి ఇస్తానని చెప్పారు. ఆమె నిజంగా చెప్పిందా లేకపోతే రాజకీయమా అన్నది క్లారిటీ లేదు. కానీ అందులో ఏదైనా మ్యాటర్ ఉంటే మాత్రం రానున్న రోజుల్లో సంచలనం ఖాయమనుకోవచ్చు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం బీజేపీకి ఇష్టం లేదని అనుకోవచ్చు. ముఖ్యమంత్రి మార్పు చర్చల్లో కాంగ్రెస్ నేతలు చాలా మంది తమకే సీఎం పదవి అని లెక్కలు వేసుకుంటున్నారు. ఎవరికి వారు ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టుకుంటున్నారు. బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. వీరిలో ఒకరైనా బీజేపీ వైపు కొంత మంది ఎమ్మెల్యేలతో వెళ్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి చిక్కులు ఏర్పడతాయి. అదే సమయంలో కర్ణాటకలో ఆపరేషన్ కమల్ నిర్వహించడంలో బీజేపీ చాలా సార్లు సక్సెస్ అయింది. ఇప్పుడు కూడా అలాంటిదే నిర్వహిస్తే ఫెయిలయ్యే అవకాశం లేకుండా చూసుకుంటుంది. అందుకే కర్ణాటకలో ఏం జరుగుతుందా అన్న ఆసక్తి దేశమంతా వ్యక్తమవుతోంది.

# సహారా ఎడారిలో నీరు..

**న్యూఢిల్లీ :** సహారా ఎడారిలో నీటిమడుగులు ఏర్పడ్డాయి. ఆ ప్రాంతంలో ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో సందడి చేస్తున్నాయి. సహారా ఎడారి మొరాకో దేశంలో విస్తరించి ఉంది. ప్రస్తుతం ఈ ఎడారిలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈత చెట్లు, నీటిమడుగుల మధ్య నీటిమడుగులు ఏర్పడ్డాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియా లో సందడి చేస్తున్నాయి. ఆగ్నేయ మొరాకో దేశంలో విస్తరించిన సహారా ఎడారిలో వర్షాలు కురుస్తాయి. అయితే గత సెప్టెంబర్ నెలలో ఈ ప్రాంతంలో కురవాల్సిన వర్షం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయింది. మొరాకో రాజధాని రబాత్ నగరానికి దక్షిణంగా 450 కిలోమీటర్లు దూరంలో ఉన్న టాగో నైట్ గ్రామంలో గత 24 గంటల వ్యవధిలో 100 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.వర్షాలు విస్తారంగా కురవడంతో సహారా ఎడారి ప్రాంతం సముద్రం లాగా కనిపిస్తోంది. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో సందడి చేయడంతో పర్యాటకులు ఈ ప్రాంతానికి తరలివస్తున్నారు. ఈత చెట్లు, ఖర్జూర చెట్ల మధ్య ఏర్పడిన నీటి గుంతులను చూసి ఆశ్చర్యపోతున్నారు.

# గౌడ సంఘం అధ్యక్షులు కానుగు బిక్షంగౌడ్ గుండెపోటు మృతి

**- నివాళులర్పించిన ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య**



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం ప్రతినిధి):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామానికి చెందిన గౌడ్ సంఘం అధ్యక్షుడు కానుగు బిక్షంగౌడ్ గుండెపోటుతో మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యశుక్రవారం అతడి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి వారికీ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మృతుని సంబంధీకులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విద్యార్థుల అ"పూర్వ" కలయిక

**- 15 సంవత్సరాల తర్వాత కలిసిన విద్యార్థులు**

**- ఆనాటి మధుర అనుభూతులను నెమరేసుకున్న స్నేహితులు**

**- 2008-2009 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**



**జమ్మికుంట, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** సమాజంలో తల్లీ, తండ్రీ, గురువు దైవంతో సమానమని, అంతటి గురువులను కలుసుకోవడం సంతోషంగా ఉందని, కాకతీయ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. జమ్మికుంట పట్టణంలోని, స్వాతి ఫంక్షన్ హాల్ లో, కాకతీయ విద్యార్థుల 2008-09 సంవత్సరాలకి చెందిన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకతీయ విద్యాసంస్థల అధినేత ఆవిరినేని సుధాకర్ రావు, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, పట్టణ సీఐ వరంగంటి రవి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఏ వ్యక్తికైనా తల్లిదండ్రులు మొదటి గురువులైతే, విద్యను బోధించిన గురువు రెండవ గురువని, నవ మాసాలు మోసి కనీ పెంచితే, భాహ్య ప్రపంచానికి క్రమశిక్షణ, మంచి నడవడిక ఎలా ఉండాలో తెలియజేసేది గురువు అని, జీవితంలో మరపురాని రూపం బాల్యం అని, అలాంటి బాల్యంలో చదువు చెప్పిన గురువులను సన్మానించడం గొప్ప విషయమని అన్నారు. పదిహేను సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు చిరునవ్వులతో, ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలలో కలసి తిరిగి తమ అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు కుటుంబ నేపథ్యాల విషయాల గురించి తెలుసుకొని, ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత బంధు రెండో విడత విడుదల చేయాలి

**- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఇన్చార్జి శ్రీకాంత్**




**హుజురాబాద్, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** హుజూరాబాద్ నియోజకవర్గంలో, దళిత బంధు రెండవ విడత పై అధికార పార్టీ స్పష్టమైన నిర్ణయం తెలియజేయకపోతే, రాబోయే రోజుల్లో, ధర్మ సమాజ్ పార్టీ రిలే నిరాహారదీక్షలు చేయటం జరుగుతుంది అని తెలియజేస్తున్నాం. లబ్ధిధారులకి న్యాయం జరిగే వరకు అనేక కార్యక్రమాలు చేస్తూ, పోరాటం కొనసాగిస్తూనే ఉంటుంది అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి శ్రీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నరేష్ తాళ్ళ, హుజురాబాద్ నియోజకవర్గ నాయకులు రాకేష్, రవి కిరణ్, సందీప్, సదానందం, రవితేజ, ప్రేమ్ సాగర్, అభిలాష్ , రవికుమార్, రాజు, జిల్లా నాయకులు శ్రీకాంత్, సురేష్ చంద్రశేఖర్ లు పాల్గొనడం జరిగింది.

# గేటు దొంగిలించాడని ఫిర్యాదు కేసు నమోదు చేసిన పోలీసులు



**జమ్మికుంట, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం విలేఖరి) :** జమ్మికుంట పట్టణంలోని, హౌసింగ్ బోర్డు కాలనీలో, శివరాత్రి ప్రవీణ్ అనే వ్యక్తి, తన ఇంటి ముందు ఉన్న గేటును తీసి ఇంటి పక్కన పెట్టగా, గేటును దొంగిలించారని ఫిర్యాదు మేరకు, గురువారం రోజున కేసు నమోదు చేసినట్లు సీఐ వరగంటి రవి తెలిపారు. ఫిర్యాదుదారుడు ప్రవీణ్ తన గేటు పోయిందని అనుమానంతో, ఇంటి ముందు ఉంటున్న తూడి రవిచందర్ఏరవిచంద్ర రెడ్డి అను అతని ఇంటిలోకి వెళ్లి చూడగా, ఆ ఇంట్లో ఇనుప గేటు అతని చేదబావి దగ్గర ఉందని ఫిర్యాదుదారుడు చూస్తుండగానే ఆ గేటును బావిలో పడేశాడని ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.




## విజయదశమి శుభాకాంక్షలు



ఎల్లారెడ్డిపేట మండల మిత్రులకు శ్రేయోభిలాషులకు ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు..

ఇట్లు,
సబేర బేగం- షేక్ గౌస్,
బొప్పాపూర్ "వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్"




# దుర్గా దేవి ని దర్శించుకున్న ప్రభుత్వ విప్







వేములవాడ, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేఖరి): దుర్గా దేవి నవరాత్రుల సందర్భంగా వేములవాడ పట్టణంలో భగవంతు రావు నగర్ లో అమ్మ భవాని ఉత్సవ కమిటీ, బిజిఆర్ యూత్,సుభాష్ నగర్ లోని శ్రీ దేవి మహంకాళి యూత్,టైగర్ యూత్,శివసేన నగర్ లో శివ సేన యూత్, రామ మందిర్ వీధిలో రామ మందిర్ బాయ్స్ యూత్, శాస్త్రి నగర్ లో వాసవి నగర్ లో లఫ్లీ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్,వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు,అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అమ్మవారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవలని వేడుకున్నారు.

# ప్రశాంతమైన వాతావరణంలో దసరా పండుగ జరుపుకోవాలి

**- అనవసరమైన గొడవలకు తెరలేపితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తాం**

**- జమ్మికుంట పట్టణ సీఐ వరంగంటి రవి**





జమ్మికుంట, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం విలేఖరి) : దసరా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని, జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి, మోత్కులగూడెం గ్రామ ప్రజలకు సూచించారు. శుక్రవారం రోజున, మోత్కులగూడెంలో గ్రామ పెద్దలు ప్రజలతో సీఐ సమావేశం నిర్వహించి, దసరా పండుగ సందర్భంగా, ఎలాంటి గొడవలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరి పై ఉందని సీఐ తెలిపారు. ఎవరైనా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన, అనవసరమైన గొడవలకు తెరలేపిన చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని, సీఐ సూచించారు. ప్రజలందరూ కూడా ప్రశాంతమైన వాతావరణంలో దసరా పండుగ నిర్వహించుకొని, మిగతా వారికి ఇబ్బంది కలగకుండా సంతోషంగా ఉండాలని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో, కౌన్సిలర్లు పొన్నగంటి మల్లయ్య, పిఎసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్, పొనగంటి సారంగం, బిట్ల మోహన్, పొనగంటి విజయ మల్లయ్య, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు. దసరా పండుగ సందర్భంగా మండల ప్రజలందరికీ సీఐ వరగంటి రవి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి మీ జీవితాల్లో విజయాలను చేకూర్చాలని ఆయన తెలిపారు.

# నుస్తులాపూర్ లో కన్నుల పండుగ సాగిన ఆర్ఎస్ఎస్ పథ సంచలన్, విజయదశమి ఉత్సవము



**తిమ్మాపూర్, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేకరి):** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రారంభమై 99 సంవత్సరాలు గడిచి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న విశేష సందర్భాన్ని పురస్కరించుకొని ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నుస్తులాపూర్ లో పథసంచలన్ (రూట్ మార్చ్ ) కార్యక్రమాన్ని, విజయదశమి ఉత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించింది . ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జిల్లా ప్రచార ప్రముఖ్ గికూరి శ్రీనివాస్ జి మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జన్మ శతాబ్ది 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భమిదన్నారు. 1925 సంవత్సరంలో విజయదశమి రోజున డాక్టర్ జి ఆర్ ఎస్ ఎస్ ను ఏర్పాటు చేశారన్నారు. ఆర్ఎస్ఎస్ జాతీయ వాద సంస్థని , మాతృభూమి, దేశం కోసం సేవ చేసే ఏకైక సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ అని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు కుమార్ జి, నర్సింగ్ జి, సంపత్ జి, పుల్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విజయదశమి శుభాకాంక్షలు

**- పీ.వి.శ్రీరమణ**



**కూకట్ పల్లి, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి):** కూకట్పల్లి నియోజకవర్గ ప్రజలందరికీ దసరా నవరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు పీవి.శ్రీరమణ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి సూచికగా నిర్వహించుకునే దసరా ఉత్సవాలు ప్రజల్లో నూతన ఉత్సాహాన్ని ధైర్యాన్ని కలిగించాలని ఆ దుర్గమ్మ దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని అన్నారు.

# సూరారం సిఐ చే మాదిగల అలైబలై పోస్టర్ ఆవిష్కరణ



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి):** ఈ నెల 27 వ తేదీ రోజున సాయంత్రం 3 గంటలకు సూరారం విలేజ్ విఐపి ఫంక్షన్ హాల్లో జరగబోయే మాదిగల అలై బలై కి సంబంధించిన వాల్ పోస్టర్ సూరారం సిఐ చే ఆవిష్కరించి అలాగే మాదిగల అలైబాలై కార్యక్రమానికి ఆహ్వానించడం జరిగిందని అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ముత్యపాగ నర్సింగ్ రావు మాదిగ, మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ దండు వినోద్ కుమార్ మాదిగ, జిల్లా నాయకులు హరి మాదిగ ఆహ్వానించారు.

# వేం నరేందర్ రెడ్డి ని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహా దారులు వేం నరేందర్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, సిహెచ్. జీత్తయ్య ముదిరాజ్, సత్తి రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, నరేష్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకుల పంపిణీ


**- సీనియర్ పాత్రికేయుడు మామిడి సోమయ్య విజ్ఞప్తి**




**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం ప్రతినిధి):** సమాజంలో అయినవారి ఆదరణ లేక అనాథలుగా మారుతున్న వృద్ధులను సమాజం ఆదుకోవాలని సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, మహానది పత్రిక ఎడిటర్ మామిడి సోమయ్య అన్నారు. అందరు ఉన్నా, కొందరు తల్లిదండ్రులు ఎవరూ లేని అనాథలుగా మారుతున్నారని, తల్లిదండ్రులను అనాథలను చేయడం సరైంది కాదని అన్నారు. శుక్రవారం ఆయన తన తండ్రి కీర్తి శేషులు మామిడి రామయ్య 14వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ వివేకానంద నగర్ లో స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత వృద్ధాశ్రమంలో వృద్ధుల కోసం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ నిరుపేద అనాథ వృద్ధులను చేరదీసి వారికి ఆశ్రయం కల్పించి సేవలు అందిస్తున్న స్పందన ఫౌండేషన్ ఆశ్రమం నిర్వాహకులను అభినందించారు. తన తండ్రియైన కీర్తి శేషులు మామిడి రామయ్య పేరిట ఏర్పాటు చేసిన మామిడి రామయ్య ఫౌండేషన్(ఎంఆర్ ఎఫ్ ) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతి రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ఇతర సందర్భాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో ఇలాంటి అనాథ వృద్ధులను, పిల్లలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆయన కోరారు.

## బతుకమ్మ వేడుకల్లో శశిరేఖ, రేణుకలకు బహుమతులు

**- అభినందించిన మోకుదెబ్బ గౌడ సంఘం నాయకులు**



**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 11(తెలంగాణ కిరణం ప్రతినిధి) :**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబరాల్లో గౌడ సామాజిక వర్గానికి చెందిన



ఆణిముత్యాలు నిలుగొండ శశిరేఖ, రేణుక,లకు బహుమతులు రావడం పట్ల సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దూడల రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బైరి విశ్వనాథం గౌడ్, ఆలేరు మండల కార్యదర్శి దూడల సాగర్ గౌడ్ లు గురువారంవారినిఅభినందించా రు. ఈ కార్యక్రమంలో ఈకార్యక్రమంలో భీమగోని సంతోష్ గౌడ్, మాసాపేట రాజుగౌడ్, కోటగిరి సత్యం గౌడ్, బైరి కాలందర్ గౌడ్, దూసరి గణేష్ గౌడ్, వడ్లకొండ రాజు గౌడ్, శంకరయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు దుర్గామాతకు 108 రకాల నైవేద్యాలు సమర్పణ

**- మహిషాసుర మర్ధిని అవతారంలో దుర్గా దేవి**



మొగుళ్లపల్లి, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేకరి): నేరేడు పల్లి, వజినపల్లి, గొర్లవేడు, కొంపల్లి గుడాడ్ పల్లి, అనుసనిపల్లి, గ్రామాల ఆర్యవైశ్య ల అందర్నీ ఒకే వేదికపై తీసుకు వచ్చిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు తొమ్మిదవ రోజు అయిన శుక్రవారం మహిషాసుర మర్ధిని గా అమ్మవారిని అలంకరించి 108 రకాల నైవేద్యాలు సమర్పించారు. ప్రధాన అర్చకుడు దెబ్బట శ్రీనివాస చార్యులు మహిషాసుర మర్ధిని అవతారంలో ఉన్న అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పూజా కార్యక్రమంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యులందరూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదే విధంగా ఆర్యవైశ్య సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## దివ్యంగా బాలికకు వీల్ చైర్ అందజేసిన ఎస్పీ



**మహబూబాబాద్, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం ప్రతినిధి):** మహబూబాబాద్ జిల్లా దివ్యంగ బాలికకు వీల్ చైర్ అందచేసిన మహ బూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఎస్పీ సీరోల్ గ్రామానికి చెందిన దివ్యంగ బాలిక కన్నబోయిన శ్రావ్య వయసు 18 పుట్టుకతోనే దివ్యంగులారు మహబూ బాబాద్ పట్టణానికి చెంది న హెూప్ స్టెప్ ఫౌండేషన్ సంస్థను సంప్రదించడంతో వెంటనే స్పందించి దాతల సహాయంతో వీల్ చైర్ సమకూర్చి ఈరోజు మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్ ఎస్పీ చేతుల మీదిగా బాలికకు అందించారు ఈ కార్యక్ర మంలో హెూప్ స్టెప్ ఫౌండేషన్ అధ్యక్షులు నాగవెల్లి శ్రీనివాస్ ఎస్పీ పి ఆర్ ఓ కుశల్ ఎస్ బి ఇన్స్పె క్టర్ చంద్రమౌళి సంస్థ సభ్యులు దుగ్గి రమేష్ ధనుష్ దిక్షిత్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉచిత ప్రయాణ హామీని నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

**- రాబోయే రోజుల్లో ధర్మపురికి ఆర్టీసీ బస్ డిపో కు కృషి**

**- ఆర్టీసీ ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం**

**- ధర్మపురి హైదరాబాద్ ఏసీ బస్సును ప్రారంభించిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ధర్మపురి, అక్టోబర్ 11 (తెలంగాణ కిరణం విలేఖరి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఆరు గ్యారంటీ లలో భాగంగా మహిళా మణులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని కల్పించే హామీని నెరవేర్చిందని తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన ఆర్టీసీ ఉద్యోగుల సేవలు



ప్రశంసనీయమని రాబోయే రోజుల్లో ప్రాచీన చారిత్రాత్మక ధర్మపురి పట్టణానికి ఆర్టీసీ డిపో ఏర్పాటుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మపురి ఆర్టీసీ బస్టాండ్ లో స్థానిక నాయకులు, ఆర్టీసీ సిబ్బందితో కలిసి ధర్మపురి హైదరాబాద్ ఆర్టీసీ ఏసీ బస్సును ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన ధర్మపురి పట్టణానికి ప్రతిరోజు రాత్రి 11 గంటల 30 నిమిషాలకు ధర్మపురి నుండి హైదరాబాద్ కు ఏసీ బస్సు నడపాలనే విజ్ఞప్తి మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడి మంజూరు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో ధర్మపురి పట్టణానికి ఆర్టీసీ డిపో ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లతో కలిసి కృషి చేస్తానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటి లను అమలు పరుస్తున్నామని, ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన అందిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ చైతన్య,ఆర్టిసి అధికారులు డిఎం సునీత, అసిస్టెంట్ ఇంజినీర్ కవిత, రెవిన్యూ అధికారులు,పార్టీ నాయకులు సంఘనబట్ల. దినేష్, చిలుముల లక్ష్మణ్, జక్కు. రవీందర్, చిపిరిశెట్టి రాజేష్, సింహారాజు ప్రసాద్, జె.సుముక్, కుంట. సుధాకర్, కస్తూరి శ్రీనివాస్, కసారపు. బాలగౌడ్, జాజాల. రమేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార నిర్వాహకుడి అరెస్ట్

వేములవాడ, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేకరి): వేములవాడ పట్టణంలో అయ్యప్ప కాలనీ ఎదురుగా మెయిన్ రోడ్డు పక్కన ఒక ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నారని పక్కా సమాచారం మేరకు వేములవాడ పట్టణ పోలీసులు ఆ ఇంటి పై రైడ్ చేయగా వెస్ట్ బెంగాల్ కు చెందిన ఒక మహిళ తో మల్లె రత్నయ్య అనే వ్యక్తి అతని ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడ్డాడు. కండోమ్ ప్యాకెట్లు బెడ్ షీట్లు 2000 రూపాయల నగదు సీజ్ చేయడం జరిగింది. రత్నయ్య స్వస్థలం నెల్లూరు జిల్లా కాగా వెస్ట్ బెంగాల్ కు చెందిన మహిళను నెల్లూరు కి రప్పించి అక్కడినుండి నుండి వేములవాడకు రప్పించి ఇక్కడ విటులను రప్పించి డబ్బులు సంపాదిస్తున్నట్టుగా విచారణలో ఒప్పుకోవడం జరిగింది.

మహిళను సఖీ సెంటర్ కు తరలించి, వ్యభిచారం నిర్వహిస్తున్న రత్నయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగింది. పవిత్రమైన దేవాలయం ఉన్న వేములవాడ పట్టణంలో ఇట్లాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అవసరమైతే వాళ్లపై పీడీ యాక్ట్ కూడా నమోదు చేయడం జరుగుతుందని, ఎట్టి పరిస్థితిలో ఇట్లాంటి అశ్లీల కార్యక్రమాలను సహించేది లేదని, వేములవాడ పవిత్రతను కాపాడటంలో పట్టణ ప్రజలందరూ ఇలాంటి అశ్లీల కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం ఉన్నట్లయితే పోలీసులకు వెంటనే తెలుపగలరని వేములవాడ పట్టణ ఇన్చార్జి సిఐ శ్రీనివాస్ కోరారు.

## కరీంనగర్ అభివృద్ధిలో కలిసి పనిచేస్తాం..

**- నేను, బండి సంజయ్ విద్యార్థి రాజకీయాల నుండి ఎదిగి ఈస్థాయికి వచ్చాం**

**- మహాశక్తి ఆలయాన్ని దర్శించుకున్న పొన్నం ప్రభాకర్**

**- కేంద్ర మంత్రితో కలిసి దాండియా వీక్షించిన రాష్ట్ర మంత్రి పొన్నం**



కరీంనగర్, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేకరి): కేంద్ర మంత్రి బండి సంజయ్, తాను వేర్వేరు పార్టీలో ఉన్నప్పటికీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో మాత్రం



రాజీలేకుండా పనిచేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పొన్నం ప్రభాకర్ కొద్దిసేపటి క్రితం కరీంనగర్ లోని మహాశక్తి ఆలయానికి విచ్చేశారు. ఆలయ నిర్వాహకులు పొన్నంకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో కలిసి మహాశక్తి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంజయ్ తో కలిసి ఆలయ ఆవరణలో నిర్వహించిన దాండియా కార్యక్రమాలను తిలకించారు. అంతకుముందు పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి మా సోదరుడు బండి సంజయ్ నాయకత్వంలో మహాశక్తి ఆలయంలో ఘనంగా నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. విద్యార్థి రాజకీయాల నుండి నేను, బండి సంజయ్ క్రియాశీలకంగా పనిచేస్తూ ఈరోజు నేను రాష్ట్ర మంత్రిగా, బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఎదిగాం. రాజకీయాలు వేరు. మేం వేర్వేరు పార్టీల్లో ఉన్నప్పటికీ కరీంనగర్ అభివృద్ధి విషయంలో మాత్రం రాజీ లేకుండా కలిసి పనిచేస్తాం. గత 30 ఏళ్లుగా రాజకీయాల్లో శ్రమ పడి ప్రజల కోసం పనిచేస్తున్నాం. ఉంటూ అమ్మవారి ఆశీస్సులతో కేంద్ర స్థాయిలో బండి సంజయ్, రాష్ట్ర స్థాయిలో నేను జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు క్రుషి చేస్తామని, అమ్మవారి దయతో ప్రజలకు మరిన్ని సేవలు చేస్తామని తెలియజేశారు.

## ముగిసిన బండి సంజయ్ "భవానీ దీక్ష"

**- మహిషాసుర వధలో పాల్గొన్న సంజయ్**

**- హిందూ బంధువులందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మంత్రి**

**- దాండియా కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు**

**- రాష్ట్ర మంత్రి పొన్నం, బీజేపీ జాతీయ నాయకులు అభయ్ పాటిల్ హాజరు**



**కరీంనగర్, అక్టోబర్ 11, (తెలంగాణ కిరణం విలేకరి):** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 11 రోజులుగా చేపట్టిన భవానీ దీక్ష నేటితో ముగిసింది. శుక్రవారం రోజున కరీంనగర్ మహాశక్తి ఆలయంలో నిర్వహించిన రుద్ర సహిత చండీ యాగం అనంతరం బండి సంజయ్ దీక్షను విరమించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన మహిషాసుర వధ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వయంగా నిప్పు అంటించి మహిషాసురుడిని అగ్నికి అహుతి చేశారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ విజయదశమి పర్వదినం సందర్భంగా హిందూ బంధువులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ లోని మహాశక్తి ఆలయంలో రేపు దసరా



సందర్భంగా నిర్వహించే షమీ పూజసహా పలు కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. పవిత్రమైన విజయదశమి సందర్భంగా ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. "చెడుపై మంచి విజయం సాధించిన రోజు విజయదశమి. చెడు ఆలోచనలను వీడి ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలతో నిత్య జీవితం గడపాలి. అలాంటి వారు కోరిన కోరికలు తీర్చాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నా."అని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ నాయకులు, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ రాష్ట్ర ఇంఛార్జ్ అభయ్ పాటిల్ ఈరోజు కరీంనగర్ విచ్చేసి మహాశక్తి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు అభయ్ పాటిల్ కు పూర్ణ కుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండి సంజయ్ తో కొద్దిసేపు ముచ్చటించారు. మరోవైపు కాసేపట్లో నిర్వహించే దాండియా కార్యక్రమాన్ని తిలకించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మహాశక్తి ఆలయానికి రానున్నారు. బండి సంజయ్ తో కలిసి దాండియా కార్యక్రమాలను వీక్షించనున్నారు.

# హిరోషిమా, నాగాసాకి అణుబాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?

1945 సంవత్సరం వస్తూ వస్తూనే జపాన్‌లో సామాన్యుల జీవితాలను నరకప్రాయం చేసింది. షాపుల్లో గుడ్లు, పాలు, టీ, కాఫీలు పూర్తిగా మాయమయ్యాయి. పాఠశాలల మైదానాల్లో, ఇంటి ఆవరణల్లో కూరగాయలు పెంచుకుని వాటినే తినేవారు. పెట్రోల్ సామాన్యులకు అందనంత ఖరీదైన వస్తువుగా మారిపోయింది. రోడ్లపై ఎక్కడా సొంత కార్లు పరుగులు తీస్తూ కనిపించేవి కావు. హిరోషిమా రహదారుల్లో ఎక్కడచూసినా సైకిళ్లలో, కాలినడకన వెళ్లే జనం, సైనికుల వాహనాలే కనిపించేవి. 1945 ఆగస్ట్ 6.. ఉదయం 7 గంటలకు దక్షిణం వైపు నుంచి వస్తున్న అమెరికా విమానాలను రాడార్లు పసిగట్టాయి. చెవులు చిల్లులు పడేలా హెచ్చరిక సైరన్ మోగింది. జపాన్ అంతటా రేడియో కార్యక్రమాలను నిలిపివేశారు. జపాన్‌లో అప్పటికే పెట్రోల్ నిల్వలు నిండుకున్నాయి. దాంతో ఆ విమానాలను అడ్డుకోడానికి జపాన్ తమ విమానాలను పంపించలేకపోయింది. 8 గంటలకు హెచ్చరిక సైరన్ ఆగింది. రేడియో కార్యక్రమాలు మళ్లీ మొదలయ్యాయి. 8 గంటల 9 నిమిషాలకు అమెరికా వైమానిక దళం కల్నల్ పాల్ టిబెట్స్ తన బీ-29 విమానం 'ఎనోలా గే' ఇంటర్ కమ్‌లో ఒక ప్రకటన చేశారు. 'మీ గాగుల్స్ తీసుకోండి, వాటిని మీ నుదుటిపై పెట్టుకోండి' అన్నాడు.

## కౌంట్ డౌన్ మొదలవగానే



'కౌంట్ డౌన్ మొదలవగానే, వాటిని మీ కళ్లకు పెట్టుకోండి. మీకు కింద భారీ వెలుగు కనిపించకుండా పోయేవరకూ వాటిని అలాగే ఉంచుకోండి'. విమానం పొట్టలో 3.5 మీటర్ల పొడవు, 4 టన్నుల బరువుతో బ్లూ-వైట్ రంగులతో ఉన్న 'లిటిల్ బాయ్' బాంబు ఉంది. దానిని టాప్ సీక్రెట్ మన్‌హాటన్ ప్రాజెక్ట్ కింద లాస్ అలామోస్, న్యూ మెక్సికోలో ఉన్న ప్రయోగశాలల్లో తయారు చేశారు. దాని తయారీని చాలా రహస్యంగా ఉంచారు. ఎంత రహస్యంగా అంటే, అధ్యక్షుడు రూజ్‌వెల్డ్ మరణించాక, ఉపాధ్యక్షుడు హారీ ట్రూమెన్ కొత్త అధ్యక్షుడి బాధ్యతలు తీసుకునే వరకూ ఆయనకు కూడా దాని గురించి తెలీదు. 'ఎనోలా గే' కుడి రెక్క నుంచి పది మీటర్ల దూరంలో ఒక కిలోమీటర్ వెనుక 'గెట్ ఆర్టిస్ట్' అనే ఇంకో బీ-29 విమానం ఎగురుతోంది. అక్కడ మూడో బాంబర్ కూడా వెళ్తోంది. దానిని జార్జ్ మార్క్‌వర్డ్ నడుపుతున్నారు. ఆయనకు ఫొటోలు తీసే బాధ్యత మాత్రమే అప్పగించారు. సరిగ్గా 8 గంటల 13 నిమిషాలకు 'ఎనోలా గే, బాంబార్డియర్ మేజర్ టామ్స్ ఫ్రేబీకి హెడ్ ఫోన్లో 'ఇటీజ్ ఆల్ యువర్స్' అని కల్నల్ పాల్ టిబెట్స్ సందేశం వినిపించింది.. తర్వాత ఆయన ఇంటర్‌కామ్‌లో 'మీ గాగుల్స్ పెట్టుకోండి' అన్నాడు. ఫ్రేబీకి తన గాగుల్స్ నుంచి టార్గెట్ ఏఓఐ బ్రిడ్జ్ కనిపించగానే, 'ఐ హావ్ గాటిట్' అని అరిచాడు.

## హీరోషిమాపై పడిన లిటిల్ బాయ్



సరిగ్గా 8 గంటల 15 నిమిషాలకు 'ఎనోలా గే' నుంచి బయటకు వచ్చిన లిటిల్ బాయ్ హిరోషిమా మీద పడడం మొదలైంది.. 'ఎనోలా గే' నుంచి లిటిల్ బాయ్ కిందకు రావడానికి 43 సెకన్లు పట్టింది. గాలులు వేగంగా వీస్తుండడంతో అది తన లక్ష్యం ఏఓఐ బ్రిడ్జికి 250 మీటర్ల దూరంలో ఉన్న షీమా సర్జికల్ క్లినిక్ పైన పడింది. అది పేలినపుడు ఆ శక్తి 12,500 టన్నుల టీఎంటీతో సమానంగా ఉంది. ఆ ఉష్ణోగ్రత హఠాత్తుగా 10 లక్షల సెంటీగ్రేడ్‌కు చేరింది. 'ద గ్రేట్ ఆర్టిస్ట్'లో ఉన్న పైలెట్ మేజర్ చార్లెస్ స్వీనీ పైనుంచి చూసినపుడు విశాలంగా ఉన్న ఒక అగ్నిగోళం ఏర్పడడం కనిపించింది. ఒకే ఒక్క క్షణంలో నగరంలోని కాంక్రీట్ భవనాలు తప్ప భూమిపై వస్తువులన్నీ మాయమైపోయాయి. విస్ఫోటనం తీవ్రతతో గ్రౌండ్ జీరో నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్ని భవనాల కిటికీ అద్దాలూ ముక్కలైపోయాయి.

## ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్ బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

## ఆటం బాంబ్ వేసిన విమానం ఏమైంది.?



హిరోషిమా నగరంలో రెండు వంతుల భవనాలు ఒక్క క్షణంలోనే ధ్వంసమయ్యాయి. కొన్ని కిలోమీటర్ల వరకూ మంటలు తుఫానులా వ్యాపించాయి. ఒక్క క్షణంలోనే నగరంలోని రెండున్నర లక్షల జనాభాలో 30 శాతం మంది అంటే 80 వేల మందిని మృత్యువు బలి తీసుకుంది. విస్ఫోటనం జరగగానే 'ఎనోలా గే' ముందు కేబిన్లోకి కూడా ఆ వెలుగు వ్యాపించింది. పైలెట్ పాల్ టిబెట్స్‌కు తన పళ్లు వణికినట్టు వింతగా అనిపించింది. విమానం వెనుక భాగంలో కూచున్న టెయిల్ గన్నర్ బాబ్ కేరన్, తన కొడాక్ కెమెరా తీశాడు. కింద కనిపిస్తున్న దృశ్యాలను ఫొటోలు తీయడం మొదలుపెట్టాడు. కింద ఎర్రటి మేఘాల మధ్య తెల్లటి పొగ 3 వేల అడుగుల వరకూ పైకి ఎగిసింది. అది ఒక పుట్టగొడుగు ఆకారంలో కనిపించింది. 'ఎనోలా గే' కో పైలెట్ కెప్టెన్ రాబర్ట్ లూయిస్ తన లాగ్ బుక్‌లో 'మై గాడ్ వాట్ హావ్ వియ్ డన్?' అని రాశాడు. 'ఎనోలా గే' వెపనియర్ విలియమ్ పార్సన్స్ 'ప్రయోగం విజయవంతమైంది, విమానంలో పరిస్థితి మామూలుగా ఉంది' అని ఒక కోడ్ సందేశం పంపించాడు.

## బాంబు నేలను తాకినప్పుడు ఏం జరిగింది.?



జపాన్ నౌకా దళం డ్రాఫ్ట్‌మెన్ సుతోమూ యామాగూచీ దృష్టి పైన ఎగిరే విమానంపై పడింది. విమానం నుంచి ఒక చిన్న నల్లటి వస్తువు కింద పడుతుండడం కనిపించింది. తర్వాత క్షణంలోనే అతడికి కళ్ల ముందు చూపు పోయేంత వెలుగు వచ్చింది. అతడి అవయవాలన్నీ పనిచేయడం మానేశాయి. దాంతో చేతులతో కళ్లు మూసుకున్న అతడు నేలపై బోర్లా పడిపోయాడు. కింద భూమి కంపించడంతో యామాగూచీ సుమారు అర మీటరు ఎత్తుకు ఎగిరిపడ్డాడు. తను తిరిగి కళ్లు తెరిచినప్పుడు చుట్టూ అంధకారం అలుముకుని ఉంది. హఠాత్తుగా అతడికి తన ఎడమ వైపున, ఎడమ చేతి దగ్గర భరించలేనంత వేడిగా అనిపించింది. వాంతి చేసుకోవాలనిపిస్తోంది. కళ్లు తిరుగుతున్నాయి. స్పృహ తప్పుతోంది. అప్పుడే అతడికి కొంత దూరంలో ఒక చెట్టు కనిపించింది. దాని ఆకులన్నీ పూర్తిగా రాలిపోయి ఉన్నాయి. ఆ చెట్టు వరకూ వెళ్లడానికి అతడు తన బలమంతా ఉపయోగించాడు. ఎలాగోలా అక్కడికి చేరుకుని దాని మొదలు దగ్గర కూచున్నాడు. అప్పటికే అతడి గొంతు పూర్తిగా ఎండిపోయింది. దాహంతో తపించి పోతున్నాడు.

## బతికి బయటపడినా




హిరోషిమా తూర్పు ప్రాంతంలో ఒక రైలు నగరం వైపు వస్తోంది. సైనికులు హఠాత్తుగా వెళ్తున్న ఆ రైలును ఆపేశారు. లోపల ఉన్న వాళ్లందర్నీ కిందకు దించేసి వెళ్లిపొమ్మన్నారు. డబ్బాలను ఇంజన్ నుంచి వేరు చేసి, అక్కడే ఆపేశారు. కానీ ఇంజన్ మాత్రం ముందుకెళ్లిపోయింది. కానీ అది ఎంతో దూరం వెళ్లలేకపోయింది. ఎందుకంటే కాలినడకన వెళ్లే వారితో ఆ రైల్వే లైన్ అంతా నిండిపోయి ఉంది.వారిలో కొంతమంది ముఖం నుంచి చర్మం ఊడిపోయింది. కొంతమంది చేతులు విరిగిపోయి శరీరానికి వేలాడుతున్నాయి. కొంతమంది చాలా నెమ్మదిగా నడుస్తున్నారు. వాళ్లందరి నోటి నుంచి ఒకే మాట వస్తోంది. 'నీళ్లు.. నీళ్లు కావాలి.'

## నేను చనిపోతానా.?




అణుబాంబు విస్ఫోటనంతో ఏర్పడిన మేఘాల వల్ల సుమారు 11 గంటలకు హీరోషిమాలో భారీ వర్షం కురవడం మొదలైంది. ఆ వర్షం నల్లగా పడుతోంది. దానిలో దుమ్ము, ధూళి, విస్ఫోటనంతో ఉత్పన్నమైన రేడియో ధార్మిక లక్షణాలు ఉన్నాయి. నిజానికి, ఆ వర్షం చిక్కగా ఉన్న నల్లటి రంగులా ఉంది. గ్రీజులా ఉన్న ఆ వర్షంతో గోడలపై, బట్టలపై మరకలు పడ్డాయి. అక్కడ ఆకులు లేని చెట్టు కింద కూచున్న యామాగూచీ మాత్రం రేడియో యాక్టివ్ వర్షంలో తడవకుండా ఉండగలిగాడు. కాస్త దూరంలోనే ఒక గుంత కనిపించిండంతో అక్కడికి పాక్కుంటూ వెళ్లాడు. అక్కడ ఒక మహిళ ఉంది. ఆమె బట్టలన్నీ కాలిపోయాయి. చర్మం కూడా కమిలి ఎర్రగా అయిపోయింది. ఆమె లేవాలని ప్రయత్నించింది. కానీ పడిపోయింది. లేవలేని స్థితిలో 'సాయం చేయండి, సాయం చేయండి' అంటోంది. యామాగూచీని చూడగానే గొంతు తెచ్చుకున్న ఆమె 'నేను చనిపోబోతున్నానా' అని అడిగింది. అప్పుడే అక్కడకు ఇద్దరు విద్యార్థులు వచ్చారు. వాళ్లకేం కాలేదు. వాళ్లు యామాగూచీతో 'మీరు బాగా కాలిపోయినట్టు కనిపిస్తున్నారు' అన్నారు. యామాగూచీ తన ముఖాన్ని మెల్లగా తడుముకున్నాడు. చర్మం ఊడి చేతికి వస్తున్నట్టు అనిపిస్తోంది. నల్లగా అయిపోయిన తన చేతులు అంతకంతకూ వాచిపోతున్నాయి. ఆ విద్యార్థులు యామాగూచీని తీసుకుని క్లినిక్ చేరారు. అక్కడ కాలిపోయిన శవాలు ఉన్నాయి. కొంతమంది చేతులు కాస్త కదులుతున్నాయి. కానీ ఎక్కువ మంది శరీరాలు ఎలాంటి చలనం లేకుండా ఉన్నాయి. అక్కడ ఒక కంపౌండర్ యామాగూచీ ముఖంపై తెల్లటి క్రీమ్ రాశాడు. చేతికి కట్టు కట్టాడు. అక్కడ రెండు బిస్కెట్లు, కొన్ని నీళ్లు ఇచ్చారు. బిస్కెట్ కొరకగానే అతడు వాంతి చేసుకున్నాడు.

## హిరోషిమా విధ్వంసం చూసిన మొదటి విలేఖరి



స్థానిక విలేకరి 37 ఏళ్ల సాతోషీ నాకామురా ఆరోజు హీరోషిమాకు కాస్త దూరంలో ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లడం వల్ల ప్రమాదం తప్పించుకున్నారు. హీరోషిమాపై అణుబాంబు పడినప్పుడు, ఆ ప్రభావంతో ఆయన నేలమీద పడ్డారు. తన ముఖానికి పగిలిన అద్దాలు గుచ్చుకున్నాయి. తర్వాత నాకామురా తన సైకిల్ తీసుకుని హీరోషిమా వైపు బయల్దేరారు. నాకామురా హీరోషిమా విధ్వంసాన్ని చూసిన తొలి విలేకరి అయ్యారు. ఆయన డోమీ వార్తా ఏజెన్సీకి ఒకాయామా ఆఫీసు నుంచి మొదటి వార్త డిక్టేట్ చేశారు. '8 గంటల 16 నిమిషాలకు శత్రువులు రెండు విమానాల్లో హీరోషిమాపై ఒక ప్రత్యేక బాంబు వేశారు. హీరోషిమా మొత్తం నాశనం అయిపోయింది. సుమారు లక్షా 70 వేల మంది చనిపోయారు' అని చెప్పారు. ఈ వార్త విన్న డోమీ బ్యూరో చీఫ్, నాకామురాతో అది నిజం కాదేమో అన్నారు. ఒక్క బాంబు వల్ల హీరోషిమాలో అంత మంది చనిపోతారా? నీ రిపోర్టులో మృతుల సంఖ్య మార్చాలని చెప్పారు. ఎందుకంటే సైన్యం దాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. దాంతో కోపం వచ్చిన నాకమూరా టెలిఫోన్లోనే 'సైనికులు మూరు?లు' అని గట్టిగా అరిచాడు.

## మూడు రోజుల తర్వాత నాగసాకి మీద పడిన 'ఫ్యాట్ మ్యాన్'



1945 ఆగస్టు 9 మధ్యాహ్నం. జపాన్‌లోని మరో నగరం నాగసాకిలో బీ-29 బాంబర్లు రెండో ఆటం బాంబు జారవిడిచాయి. అది కిందకు చేరడానికి 43 సెకన్లు పట్టింది. బాంబు విస్ఫోటనంతో కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ ధ్వంసమైపోయింది. ఉష్ణ కిరణాలు మనుషుల శరీరంలోని ప్రతి నీటిబొట్టునూ ఆవిరి చేశాయి. క్షణంలోనే చాలా మంది చనిపోయారు, జంతువులు మాడిపోయాయి. పేలుడు తీవ్రతకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్ల అద్దాలు కూడా ముక్కలైపోయాయి. విస్ఫోటనంతో ఎగసిన వెలుగు కొన్ని సెకన్లే ఉన్నా, దానివల్ల ఏర్పడిన వేడి చర్మంపై థర్డ్ డిగ్రీ బర్న్స్ వచ్చేలా కాల్చేసింది. బాంబు పడిన ప్రాంతానికి 500 మీటర్ల దూరంలో షిరోయామా ప్రైమరీ స్కూల్లో కాంక్రీట్ స్తంభాలు తప్ప వేరే ఏం మిగల్లేదు. అక్కడే నిలబడ్డ చియోకో ఇగాషిరా భయంకరమైన పేలుడు శబ్దాన్ని విన్నాడు. అప్పుడు తన వీపు నుంచి కొంత భాగం ఎగిరిపోయినట్టు అతడికి అనిపించింది. ఇగాషిరా వెంటనే కూతురికి తన శరీరాన్ని అడ్డుపెట్టి కవర్ చేశాడు. ఆ సమయంలో ఆమె తలపై వెంట్రుకలన్నీ నిక్కబొడుచుకున్నాయి. కనుబొమల్లో ఒక్క వెంట్రుక కూడా మిగల్లేదు. ఇగాషిరా సాయం కోసం అరవాలని ప్రయత్నించాడు. కానీ తన నోటి నుంచి మాట రాలేదు.

## క్షణంలో నాగాసాకి నేలమట్టం



బాంబు పడిన కేంద్రానికి కిలోమీటర్ పరిధిలో ప్రతి వస్తువూ వేడికి ఆవిరైపోయింది. అన్నీ కాలి బూడిదైపోయాయి. మైక్రో సెకను లోపలే నాగాసాకీ జైలులోని మూడు భవనాలు నేలమట్టం అయ్యాయి. జైల్లో ఉన్న ఒక్కరు కూడా బతకలేదు. రూట్ నంబర్ 206లో కరెంటుతో నడిచే ట్రామ్ నామరూపాలు లేకుండా పోయింది. నాగసాకీ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో డాక్టర్ తకాషీ నగాయీ తన తరగతిలో ప్రాక్టీస్ చేయించడం కోసం కొన్ని ఎక్స్ రే ఫిల్ములు వెతుకుతున్నారు. అప్పుడే అతడికి చూపు పోగొట్టేంత వెలుగు కనిపించింది. ఆ పేలుడు తీవ్రతతో కిటికీ అద్దాలు పగిలి గది లోపలికొచ్చి పడ్డాయి. ఆ కిటికీల నుంచి గాలి వేగంగా లోపలికొచ్చింది. డాక్టర్ తకాషీ గాల్లో ఎగిరి పడ్డారు. ఆయన ముఖంపై కుడివైపు కోసుకుపోయింది. ముఖమంతా వేడిగా ఉన్న రక్తం కారుతోంది. అంతగా గాయపడ్డా తనకు ఎలాంటి నొప్పి లేకపోవడం ఆయనకు ఆశ్చర్యం కలిగించింది.

## ఒకటిన్నర కిలోమీటర్ దూరం వరకూ



ఆస్పత్రి బయట ఏ వస్తువూ గుర్తించేలా లేదు. అక్కడే ఉన్న సునియో తోమీతా కింద పడిన తన స్నేహితుడు కామోతోను తన భుజాలపై ఎత్తుకోవడానికి ప్రయత్నించాడు. కానీ అతడి చేతులకు స్నేహితుడి మాంసం మాత్రమే వచ్చింది. కామోతో మళ్లీ కింద పడిపోయాడు. చనిపోతున్న వారికి, చనిపోయిన వారికి నోటి నుంచి రక్తం వచ్చింది. తోమీతా వాళ్ల మధ్యకు వెళ్లి నీళ్లు అందించాడు. వారికి ఏం కాదని చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ కాసేపటికి అతడు, ప్రొఫెసర్ సికీ మాత్రమే ప్రాణాలతో మిగిలారు. ఆయన చుట్టూ సుమారు 20 శవాలు పడున్నాయి. ఎక్కడ చూసినా మంటలు చెలరేగుతున్నాయి. విస్ఫోటనం జరిగిన స్థలం నుంచి సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న ఒక టార్పెడో ఫ్యాక్టరీలో మిత్సుయీ తకీనో కూడా స్పృహతప్పి నేలపై పడిపోయింది. ఆమెకు స్పృహ వచ్చినపుడు చుట్టూ జనాల అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఆమె పైనంతా శిథిలాలు పడున్నాయి. ఆమె కష్టంగా తన కుడి చేతిని తప్పించగలిగింది, కానీ కింద నేలపై ఆమెకు తడిగా ఏదో తగిలింది. తడిమి చూసినపుడు, నేలపై తన రక్తమే ఉందని, తను రక్తపు మడుగులో ఉన్నానని ఆమెకు తెలిసింది.

**( క్రేక్ కోలీ పుస్తకం 'నాగాసాకీ', జేమ్స్ డెల్‌గా ర్డో పుస్తకం 'న్యూక్లియర్ డాన్', చికాసావు మోరాసామీ పుస్తకం 'ద వైట్ స్కై ఇన్ హిరోషిమా' ఆధారంగా )**

# సంస్కారాలు



గృహస్థు పాటించాల్సిన సంస్కారాల గురించి మనకు మన ప్రాచీన మహర్షులు గృహ్య సూత్రాల రూపంలో, కొన్ని వేల సంవత్సరాల క్రితమే చెప్పి ఉన్నారు. సంస్కారం అంటేనే సంస్కరించునది అని అర్థం. అంటే, ఈ సంస్కారాలు పాటించడం ద్వారా మనిషి సంస్కారవంతుడు అగుచున్నాడు. ఏవిధంగా అయితే మట్టిలో ఇతర ఖనిజలవణాలతో కలిసిపోయి దాదాపుగా మట్టిలాగే దొరికిన బంగారం, సంస్కరించబడి, అనుభవయోగ్యమైన సువర్ణంగా, ఆభరణాలుగా మారుతుందో, అలాగే మనిషి కూడా సంస్కారాలు పాటించడంద్వారా ఉన్నతమైన జీవన విధానాన్ని, పరిపక్వమైన మానసికస్థితిని పొందుచున్నాడు. తద్వారా సమస్తజనాలూ సుఖసంతోషాలతో నివసించగలిగేలా క్రమశిక్షణతో కూడిన నడవడికగల ఒక సర్వోన్నత ధార్మికసమాజాన్ని నిర్మించగలిగాడు. సంస్కారాల సంఖ్యగురించి అభిప్రాయ భేదాలున్నా, లోకంలో ప్రాచుర్యంపొందినవి మాత్రం పదహారే. ఈ పదహారు రకాల సంస్కారాల గురించి, అవి అనుసరించాల్సిన సమయాల గురించి, వాటి విధానాల గురించి, ఈ వ్యాసంలో క్లుప్తంగా తెలుసుకుందాం. మనిషికి ఈ సంస్కారాలు జరిగినట్లుగా మనకంటికి ఏమైనా మార్పులు కనిపిస్తాయా? అంటే కొన్ని సంస్కారాల తాలూకు మార్పులు కంటికి కనిపిస్తాయి, కొన్ని కనిపించవు. ఎందుకంటే, కొన్ని సంస్కారాలు శరీర సంబంధ వేషభాషలలో మార్పులు తీసుకొస్తే, కొన్ని సంస్కారాలు మానసిక పరిపక్వతనీ, ఉన్నతమైన ఆలోచనావిధానాన్నీ, సామాజిక శ్రేయస్సును కలిగిస్తాయి. శరీర సంబంధ మార్పులు కంటికి కనిపిస్తాయి, కానీ మానసికమైన మార్పులు మాత్రం వారి ప్రవర్తనలో, మాట్లాడే విధానంలో, ఎదుటివారిని గౌరవించే తీరులో, వారు తీసుకునే నిర్ణయాలలో ప్రతిబింబిస్తాయి. ఏది ఏమైనా, 'వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ వకారైః పంచభిర్యుక్తః నరోభవతి పూజితః' అను ఆర్యోక్తిని అనుసరించి, ఒక వ్యక్తి గౌరవించబడాలంటే, పంచవకారాలైన వస్త్రం, వేషభాషలు, విద్యా వినయాలను పాటించాలి. వాటిని నేర్పించేది కూడా ఈ సంస్కారాలే. గర్భాధానం మొదలుగాగల పదిహేను సంస్కారాలు మనిషి జీవించి వుండగా జరిపించేవి కాగా, పదహారవ సంస్కారమైన అంత్యేష్టిమాత్రం మనిషి మరణించిన తరువాత జరిపించేది. ఇది మానవశరీరాన్ని అగ్ని మొదలైన పంచభూతాలకు హవిస్సుగా అర్పించే పరమ పవిత్రమైన సంస్కారంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. దాదాపుగా ప్రతి సంస్కారమూ అగ్నిని ఆధారంగాచేసుకునే జరపాలని సమస్త గృహ్యశాస్త్రాలూ చెప్తున్నాయి. సంస్కారాల వలన సంస్కరింపబడి, దయ ఓర్పు మొదలైన ఆత్మగుణాలు కలిగినవారు పరమపదాన్ని పొందుతారని స్మృతులు చెప్తున్నాయి. సంస్కారాల వరుసక్రమంలో అభిప్రాయ భేదాలున్నా, దాదాపుగా అందరూ అంగీకరించిన వరుసక్రమాన్ని అనుసరించే వాటిని వివరించడం జరుగుతుంది.

# వజ్రాల సీతాకోక చిలుకల బ్యాగు.. విలువెంతో తెలుసా!



రోమ్: సాధారణంగా ఓ హ్యాండ్ బ్యాగు ఖరీదు 500 రూపాయల నుంచి ప్రారంభమై వేలల్లో ఉంటుంది. ఇక కొన్ని ప్రత్యేకమైన బ్రాండ్స్‌కు చెందిన ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగుల విలువ లక్షల్లో ఉంటుంది. కానీ ఇటలీకి చెందిన ఓ బ్యాగుల కంపెని ఇటివల తయారు చేసిన బ్యాగు విలువ తెలిస్తే అందరూ నోళ్ళు వెల్లబెట్టాల్సిందే. అలిగేటర్(మొసలి జాతికి చెందిన) చర్మంతో తయారు చేసిన ఈ చిన్న బ్యాగు విలువ రూ. 53 కోట్లు అంట. దీంతో ప్రస్తుతం ఇది ప్రపంచంలోని అత్యంత ఖరీదైన బ్యాగు అయ్యింది. అయితే దానికి ఎందుకు అంతా ఖరీదు అని ఆలోచిస్తున్నారు. ఎందుకంటే ఈ బ్యాగును వజ్రాలు, మరకత మాణిక్యాలతో పాటు విలువైన రాళ్లతో అలంకరించారు. దీనిని బోరిని మిలానేసి అనే లగ్జరీ లెదర్ హ్యాండ్ బ్యాగుల కంపెనీ తయారు చేసింది. చూడగానే కళ్లు చెదరిలా తయారు చేసిన ఈ బ్యాగును అలిగేటర్ చర్మంతో తయారు చేసిన ఈ బ్యాగుపై తెల్లరంగు బంగారంతో తయారు చేసిన 11 సీతాకోక చిలుకలను అమర్చారు. ఈ సీతాకోక చిలుకలపై మొత్తం 30 క్యారట్ల వజ్రవైఢూర్యాలు, అరుదైన మరకత మాణిక్యాలను పొదిగారు. అయితే ఈ బ్యాగు తయారు చేసేందుకు దాదాపు 1000 గంటలకు పైగా సమయంలో పట్టిందని ఈ సంస్థ వెల్లడించింది. దీనితోపాటు ఇలాంటివే మరో రెండు బ్యాగులను కూడా ఈ సంస్థ తయారు చేసింది. కాగా ఖరీదైన ఈ హ్యాండ్ బ్యాగులను మహాసముద్రాల కాలుష్యంపై అవగాహన కలిగించేందు కోసమే తయారు చేసినట్లు బోరిని మిలానేసి సంస్థ తెలిపింది. వీటి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును సముద్ర కాలుష్య నివారణకు వినియోగిస్తామని ఈ సంస్థ వెల్లడించింది. అయితే దీనిని ఇంతవరకు ఎవరూ ఖరీదు చేయలేదని ఆ సంస్థ పేర్కొంది. ప్రపంచలోనే అత్యంత ఖరీదైన ఈ బ్యాగును ఏ సంపన్నులు సొంతం చేసుకుంటారో వేచి చూడాలి.

# పుష్కరతుంగ... భద్రగంగ




జలాన్ని దేవతా రూపంలో తల్లిగా భావించి పూజించడం హిందువుల సంప్రదాయం. నదీస్నానాలు, కోనేటి స్నానాలు, మంగళ స్నానాలు, సముద్ర స్నానాలు... అలాగే తీర్థ యాత్రలు, పుణ్య క్షేత్రాలు దర్శనం... సమస్తం నీటితో ముడిపడి వున్నాయి. నదీ స్నానాలలో పుష్కర స్నానం పుణ్య ప్రదమని హిందువుల విశ్వాసం. సకల జీవరాశులకు ప్రధానమైన జలస్నానం ప్రాముఖ్యతను గుర్తుచేసేవే పుష్కరాలు. 'తుంగే పానీ.. గంగే స్నానే' అన్నది ఆర్యోక్తి. గంగానదిలో స్నానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో తుంగభద్ర జలాలు తాగితే అంతే పుణ్యం వస్తుందని దీనికి అర్థం! అసలు తుంగభద్ర నది ఎలా ఏర్పడిందో తెలుసుకుందాం. హిరణ్యాక్షుడు భూమిని చాపగా చుట్టి సముద్రంలో వేయగా శ్రీ మహావిష్ణువు వరాహావతారమెత్తి తన కోరలతో భూమిని సాగరం నుండి పైకెత్తి సర్వజీవులనూ రక్షించాడు. తుంగ (ఎత్తు) నుండి రావడం వల్ల తుంగానదిగానూ, హిరణ్యాక్షుని సంహరించే సమయంలో వరాహరూపుడైన విష్ణువు కుడి కోర నుండి కారిన లాలాజలం భద్రానదిగానూ ఉద్భవించాయి.పుష్కరాలు జరిగే 12 నదులలో తుంగభద్ర ఒకటి. రాష్ట్రంలో చివరి తుంగభద్ర పుష్కరాలు 2008 లో జరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత తొలిసారి తుంగభద్ర పుష్కరాలు ఇవే. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు నిర్వహిస్తారు. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదిలో కొలువై ఉంటారని, ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి.ప్రముఖ దేవాలయాలను తాకుతూ వెళుతున్న తుంగభద్ర..కర్ణాటక: శృంగేరి (చిక్మగుళూరు), పంపావతి దేవాలయం(కంప్లి), హరిహరేశ్వర దేవాలయం(హంపి).ఆంధ్రప్రదేశ్: రాఘవేంద్రస్వామి ఆలయం, (మంత్రాలయం), శివరామాలయం (గుంద్రేవుల).తెలంగాణ: సంతాన వేణుగోపాలస్వామి ఆలయం (వేణిసోంపురం), వైకుంఠ నారాయణ స్వామి ఆలయం (రాజోళి), సూర్యనారాయణ స్వామి ఆలయం (పుల్లూరు), జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలు (అలంపూర్), సంగమేశ్వరాలయం. తుంగ, భద్ర నదులు కలసి కర్ణాటక రాష్ట్రంలోని పశ్చిమ కనుమల నుంచి ప్రవహిస్తాయి. ఈ రెండు నదులు కలిసి తుంగభద్ర నదిగా మారి.. కర్ణాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం మేళగనూరు వద్ద ప్రవేశిస్తుంది. తెలంగాణలో జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం కుట్కనూరు వద్ద తుంగభద్ర రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. అనంతరం పులికల్, రాజోళి, పుల్లూరు మీదుగా సాగుతూ నదీతీరంలో కొలువైన దేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలుస్తుంది. తుంగభద్ర నది రాష్ట్రంలో ప్రవేశించిన తర్వాత సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించి సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో సంగమం అవుతున్నది. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురువడంతో తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది.

# చేపలో ఎన్ని పోషాకాలున్నాయో.. తెలుసా...?

హైదరాబాద్ : చేపల పులుసే కాదు, చేపల వేపుడు కూడా అద్భుతంగానే ఉంటుంది. అయితే ఏదో ఒక రూపంలో చేపలను వారంలో కనీసం 2 లేదా 3 సార్లు తీసుకుంటే మనకు అనేక అద్భుతమైన లాభాలు కలుగుతాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.వయస్సు మీద పడడం వల్ల ఎవరికైనా సహజంగానే మతిమరుపు వస్తుంటుంది. కొందరికి ఇది తీవ్రతరమై అల్జీమర్స్‌కు దారి తీస్తుంది. అలాంటి సమస్య ఉన్నవారు చేపలను తినడం వల్ల ఆ సమస్య నుంచి బయట పడవచ్చని 2016లో పలువురు అమెరికన్ సైంటిస్టులు చేపట్టిన పరిశోధనలో వెల్లడైంది. చేపలను తినడం వల్ల మెదడు బాగా పనిచేస్తుందట. జ్ఞాపకశక్తి పెరుగుతుందని వారు చెబుతున్నారు.–చేపలను బాగా తినడం వల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ కార్డియాలజీలో ఓ అధ్యయన వివరాలను ప్రచురించారు. చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు రక్తంలో ఉండే ట్రై గ్లిజరైడ్లను తగ్గిస్తాయి. దీంతో రక్తనాళాల్లో ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. – చేపలను తరచూ తినడం వల్ల వాటిల్లో ఉండే డోపమైన్, సెరొటోనిన్ అనే హార్మోన్లు డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. నిత్యం ఎదురయ్యే ఒత్తిడి, మానసిక ఆందోళన తగ్గుతాయని సైంటిస్టుల పరిశోధనల్లో వెల్లడైంది. –చేపల్లో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కీళ్ల నొప్పులను తగ్గిస్తాయి. అలాగే పెద్దపేగు, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్, పాంక్రియాటిక్ క్యాన్సర్ తదితర క్యాన్సర్లు రాకుండా ఉంటాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ఓ అధ్యయ వివరాలను ప్రచురించారు.



# ప్రకృతిని పరిరక్షించుకోకపోతే విపత్తులు తప్పవు

**- తిండిగింజలు - 2.3 కోట్ల టన్నులు - కూరగాయలు - 2.1 కోట్ల టన్నులు - ఏటా మనం వృథా చేస్తున్న ఉత్పత్తులు (ఆహార శుద్ధీకరణ మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం...)**

**- పండ్లు- 1.2 కోట్ల టన్నులు - ఈ వృథా మొత్తం విలువ - 440 కోట్ల డాలర్లు (రూ. 32,329 కోట్లు) - ఈ ఆహార వృథా ద్వారా ఉత్పత్తి అయ్యే చెత్తను కూడా పరిగణనలోకి తీసుకుంటే విలువ: 1,060 కోట్ల డాలర్లు(రూ. 77,885 కోట్లు)**

**68 శాతం..** 1970 - 2016 మధ్యకాలంలో తగ్గిపోయిన క్షీరదాలు, పక్షులు, ఉభయ చరాలు, సరిసృపాలు, చేపల సంతతి

**85 శాతం..** మనిషి కోల్పోయిన చిత్తడినేలల విస్తీర్ణం

**21.000** లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ (ఎల్‌పీఐ)లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా గమనిస్తున్న జంతుజాలాల సంఖ్య

**49 శాతం..** భారత్‌లో కేవలం రెండేళ్లలోనే కాలుష్యం బారిన పడ్డ నదీ ప్రవాహాలు. ఢిల్లీలో యమున, దామన్ లోని దామన్ గంగ, ముంబైలోని మీఠీ, హరియాణాలో గగ్గర్, గంగా నదిలోని పలు ప్రాంతాలు ఇందులో ఉన్నాయి.

**1,000** గంగ నదీ పరీవాహక ప్రాంతంలో ఉపనదులు, ఇతర జల వనరుల ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆనకట్టల సంఖ్య

**3** తాబేళ్ల వినాశనం విషయంలో భారత్ ర్యాంకు. చైనా, వియత్నాంలో మనకంటే ఎక్కువ విధ్వంసం జరుగుతోంది!

**0.03 శాతం..** దేశ భౌగోళిక విస్తీర్ణంలో చిత్తడి నేలలు.

**2,500** మన జీవనదుల్లో మిగిలిన గాంజెటిక్ డాల్ఫిన్ల సంఖ్య!

**గొరిల్లాలు.. బూడిద రంగు చిలకలు** ప్రమాదం అంచుల్లోన ఉన్న జంతుజాలంలో ఇవి రెండు మాత్రమే. ఇంకా అనేకం ఉన్నాయి.

**భారత్‌లో క్షీణత...** క్షీరదాల సంతతిలో తగ్గుదల 12 శాతం. కప్పల వంటి ఉభయ చరాల్లో 19 శాతం క్షీణత. పక్షుల్లో 3 శాతం తగ్గుదల.

**82 కోట్లు** దేశంలోని 12 నదీ పరీవాహక ప్రాంతాల్లో నీటి సమస్య ఎదుర్కొంటున్న జనాభా.

హరివిల్లులో ఏడు రంగుల స్థానంలో ఒక రంగు మాత్రమే ఉంటే? భూమ్మీద తెల్లటి పూలు మాత్రమే పూస్తే? పండ్లు అన్నింటి రుచి ఒకేలా ఉంటే? అబ్బే... ఏం బాగుంటుంది అంటున్నారా? నిజమే. అన్నీ ఒకేలా ఉంటే బోర్ కొట్టేస్తుంది! వైవిధ్యం అనేది మనసుకు ఆనందం కలిగిస్తుంది! ప్రయోజనాలూ బోలెడు! కానీ.. ఈ విషయం మనిషికి పూర్తిగా అర్థమైనట్లు లేదు. ఎందుకంటే.. మన మనుగడనే ప్రశ్నార్థకం చేస్తుందని తెలిసినా... వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ తదితరాల పేరుతో.... అడవులు, నదులు, సరస్సులు, నేలలను నాశనం చేస్తూనే ఉన్నాడు! వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) సిద్ధం చేసిన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ –2020 చెబుతున్నది ఇదే! కోవిడ్ మహమ్మారి విజృంభణ కొనసాగుతూనే ఉంది. కోట్ల కేసులు.. లక్షల్లో మరణాలు... ఆర్థిక వ్యవస్థ ఛిద్రం.. ఉద్యోగాల కోత. ఇలా ఎన్నెన్నో సమస్యలకు ఒక వైరస్ కారణమైందంటే ఆశ్చర్యం అనిపించక మానదు. కానీ.. కోట్ల సంవత్సరాలపాటు జంతువుల్లో నిక్షేపంగా బతికిన ఈ వైరస్‌లు ఈ మధ్య కాలంలో మనిషికి ఎందుకు సంక్రమిస్తున్నాయో.. కారణమేమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? హెచ్1ఎన్1 కానివ్వండి, చికెన్ గున్యా కానివ్వండి. స్వైన్‌ఫ్లూ కానివ్వండి అన్నీ జంతువుల నుంచి మనిషికి సోకిన వ్యాధులే. ఇప్పుడు కోవిడ్%--%19 కూడా. మనిషి ఎప్పుడైతే అటవీ సంపదను తన స్వార్థం కోసం విచ్చలవిడిగా వాడటం మొదలుపెట్టాడో అప్పటి నుంచే ఈ సమస్య కూడా పెరగడం మొదలైందని అంటారు నిపుణులు.ప్రకృతిని, జీవజాలాన్ని పరిరక్షించుకోవడం ఇప్పటికైనా నేర్చుకోకపోతే కోవిడ్%--%19 తరహా విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తన లివింగ్ ప్లానెట్ రిపోర్ట్ %--%2020లో స్పష్టం చేసింది. రెండేళ్లకు ఒకసారి విడుదల చేసే లివింగ్ ప్లానెట్ రిపోర్ట్‌ను ఈసారి దాదాపు 125 మంది నిపుణులు కలిసి సిద్ధం చేశారు. 1970 నుంచి 2016 మధ్యకాలంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 21 వేల క్షీరదాలు, పక్షులు, జలచరాలు, సరిసృపాలు సంతతిని పరిశీలిస్తూ సిద్ధం చేసిన ఈ నివేదిక దాదాపు 164 పేజీల నిడివి ఉంది. ప్రపంచవ్యాప్తంగా డబ్ల్యూడబ్ల్యూఎఫ్ పరిశీలించిన వాటిల్లో మూడింట రెండు వంతుల జంతుజాలం క్షీణావస్థలో ఉంది. మొక్కల విషయానికొస్తే... ప్రతి ఐదింటిలో ఒకటి అంతరించిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు నివేదిక చెబుతోంది. గత ఏడాది ఉష్ణమండల ప్రాంతాల్లోని అడవులనే పరిగణనలోకి తీసుకుంటే.. ఆరుసెకన్లకు రెండు ఎకరాల చొప్పున నష్టపోయామని నివేదిక తెలిపింది. అడవులు నరికివేసి వ్యవసాయం చేయడం మొదలుకొని నదీజలాల కాలుష్యంతో జలచరాలకు ముప్పు తేవడం వరకూ అన్నింటి ఫలితంగా భూమి ఇప్పుడు అత్యవసర సాయం కోరుతూ ఆక్రందనలు చేస్తోందని వివరించింది. ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేకపోతే ఇంకో పదేళ్లలో సరిచేసుకునేందుకు వీలు కానంత పెద్ద ప్రమాదంలో పడతామని హెచ్చరించింది. అయితే ఇప్పటికైనా పరిస్థితి మించిపోలేదని, దేశాలన్నీ కలిసికట్టుగా పచ్చ'ధనం' పండిస్తే.. వినియోగం విషయంలో మనల్ని మనం మార్చు కోగలిగితే భూమి మరికొన్ని కాలాలపాటు పచ్చగా ఉండేందుకు అవకాశం లేకపోలేదని చెబుతోంది ఈ నివేదిక.

**ఇవీ కారణాలు** భూ వినియోగంలో మార్పులు. అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతూ ఉండటం, జంతుజాలాల ఆవాస యోగ్య ప్రాంతాలు కుంచించుకుపోవడం జీవవైవిధ్యం తగ్గుదలకు ఒక కారణం. ప్రకృతి వనరుల విచ్చలవిడి వాడకం రెండో కారణం. ఇన్వేసివ్ స్పీషీస్ (ఇతర జీవావరణాల నుంచి వచ్చిన జంతువులు, పక్షులు, మొక్కలు) మూడో కారణం. నాలుగవ, ఐదవ కారణాలుగా కాలుష్యం, వాతావరణ మార్పులను పేర్కొనవచ్చు. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో జీవ వైవిధ్యతలో తగ్గుదలకు ప్రధానంగా వాటి ఆవాస ప్రాంత నష్టం కారణం కాగా.. ఇన్వేసివ్ స్పీషీస్, వ్యాధులు, అతి వాడకం ఇతర కారణాలుగా కనిపిస్తున్నాయి. భారత్‌లో నగరీకరణ, వ్యవసాయ కార్యకలాపాలు, కాలుష్యం వంటి కారణాల వల్ల చిత్తడి నేలలు దాదాపు లేకుండా పోయాయని లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ రిపోర్ట్ స్పష్టం చేసింది. అటవీ ప్రాంతాలు తగ్గడంతో జంతు సమూహాల్లోని సంఖ్య కూడా తగ్గిపోతోందని, ఇది కాస్తా సంతానోత్పత్తిపై ప్రభావం చూపడంతోపాటు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతోందని ఈ నివేదిక తెలిపింది. గత ఏడాది భారత్‌లో అటవీ భూములను ఇతర అవసరాల కోసం మళ్లించాలన్న అభ్యర్థనలు దాదాపు 240 వరకూ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాగా.. సుమారు 99 శాతం ప్రతిపాదనలకు అనుమతి లభించిందని ఈ నివేదిక తెలిపింది.

**సమీకృత విధానంతోనే పరిష్కారం...** వేగంగా తగ్గిపోతున్న జీవవైవిధ్యాన్ని పునరుద్ధరించాలన్నా, తద్వారా మానవ మనుగడను మరింత సుస్థిరం చేసుకోవాలన్నా ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాల్సిందే. ఆహార ఉత్పత్తిని, వాణిజ్యాన్ని మరింత ప్రకృతి అనుకూలమైన పద్ధతుల్లో చేపట్టడం ఇందులో ఒకటి మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో కనీసం మూడో వంతు వృథాగా చెత్తబుట్టల్లోకి చేరుతుండటం జీవవైవిధ్యానికి ఏమాత్రం మంచిది కాదు. ఈ వృథా కారణంగా గాల్లోకి చేరుతున్న విషవాయువులు వైమానిక రంగ ఉద్గారాల కంటే ఎక్కువగా ఆరు శాతం వరకూ ఉండటం గమనార్హం. ఆహార రంగం ద్వారా వెలువడుతున్న విషవాయువుల్లో 24 శాతం సరఫరా నష్టాలు, వినియోగదారులు వృథా చేయడమేనని నివేదిక తెలిపింది.ఈ నష్టాలన్నింటినీ తగ్గించుకోగలిగితే జీవవైవిధ్యం పెంపునకు తోడ్పడినట్లే. భారత్ విషయానికి వస్తే.. ఉత్పత్తి అవుతున్న ఆహారంలో వృథా అవుతున్నది దాదాపు 40 శాతం. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటివి ఈ నష్టాన్ని 10 నుంచి 15 శాతంగా మాత్రమే చెబుతున్నా అంతర్జాతీయ సంస్థలు 40 శాతంగా లెక్కవేస్తున్నాయి. జంతుజాలాన్ని, ప్రకృతిని పరిరక్షించడం జీవవైవిధ్యం కోసం కీలకమైనప్పటికీ కేవలం ఈ చర్యల ద్వారా మాత్రమే పరిస్థితిని పారిశ్రామిక విప్లవం మునుపటి స్థాయికి తీసుకువెళ్లలేమని వీటికి ఇతర అంశాలూ కూడా జోడిస్తేనే మేలు జరుగుతుందని ఈ నివేదిక స్పష్టం చేసింది.



# స్వయంభూ సెట్‌లో.. ఆయుధపూజ




నిఖిల్ కథానాయకుడిగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'స్వయంభూ'. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సోషియో ఫాంటసీ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. భారీ బ్జడెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా చిత్రబృందం దీనిని రూపొందిస్తోంది. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని తాజాగా ఈ సినిమా సెట్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. సినిమాలో ఉపయోగిస్తోన్న ఆయుధాలన్నింటికీ పూజ చేశారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. దసరా శుభాకాంక్షలు తెలియజేసింది.

# జిగ్రాలో నీ నటన అమోఘం


### - నువ్వు కేక..అలియాకు రష్మిక కితాబు

బాలీవుడ్ నటి అలియాభట్ పై నటి రష్మిక ప్రశంసల వర్షం కురిపించారు. యాక్టింగ్‌లో అలియా టాలెంట్, కథల ఎంపికను ఆమె మెచ్చుకున్నారు. విభిన్నమైన కథలను తరచూ ప్రేక్షకులకు అందిస్తున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. ఈ మేరకు తాజాగా ఇన్‌స్టా స్టోరీస్ వేదికగా పోస్ట్ పెట్టారు. అలియా భట్, వేదాంగ్ నటించిన 'జిగ్రా' చూశా. సినిమా అద్భుతంగా ఉంది. నటీనటులు, చిత్రబృందాన్ని గట్టిగా హత్తుకుని మెచ్చుకోకుండా ఉండలేకపోయా. అలియా.. నువ్వు మాకు దొరకడం ఓ వరం. నీ టాలెంట్‌ని చూసే అవకాశం మాకు ఇచ్చినందుకు థాంక్యూ. వేదాంగ్ నువ్వు మరెన్నో చిత్రాలు నటిస్తే చూడాలనుకుంటున్నా. రాహుల్.. నువ్వు నన్నెంతో సర్‌ప్రైజ్ చేశావు. నీకు, 'జిగ్రా'లో నువ్వు పోషించిన మత్తు పాత్రకు చాలా వ్యత్యాసం ఉంది. వాసన్ బాలా.. మేకింగ్ చాలా బాగుంది. ఇంకెన్నో విషయాలు చెప్పాలని ఉంది. చిత్రబృందం మొత్తానికి నా అభినందనలు అని రష్మిక రాసుకొచ్చారు. బాలీవుడ్ నటీనటులు అలియాభట్ , వేదాంగ్ రైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జిగ్రా' యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకత్వం వహించారు. కరణ్ జోహార్ నిర్మాత. తమ్ముడు కోసం అక్క చేసే పోరాటం నేపథ్యంలో ఇది సిద్ధమైంది. శుక్రవారం ఈ సినిమా ప్రేక్షకుల ముందుకువచ్చింది. సినీ తారల కోసం ముంబయిలో 'జిగ్రా' స్పెషల్ షో వేశారు. దీనికి రష్మిక హాజరైన విషయం తెలిసిందే. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రానా తెలుగులో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. సినిమా విడుదల సందర్భంగా మహేశ్‌బాబు చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ చెప్పారు.



# రొటీన్ కథల నుంచి బయటపడని శ్రీనువైట్ల

## విశ్వం మూవీలో కనిపించని కొత్తదనం




నటుడు గోపీచంద్.. దర్శకుడు శ్రీను వైట్ల ఇద్దరూ కొన్నాళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న క్రమంలో... ఇప్పుడీ ఇద్దరూ కలిసి విజయమే లక్ష్యంగా 'విశ్వం'తో విజయదశమి బరిలో నిలిచారు. ఇది వీళ్ల కాంబోలో తొలి సినిమా. ఇప్పటికే దీనిపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అసలు కథేంటంటే.. జలాలుద్దీన్ ఖురేషి (జిషు సేన్) కరుడుగట్టిన ఐఎస్ఐ టెర్రరిస్ట్. సంజయ్ శర్మ అనే మారుపేరుతో భారత్‌లో నివసిస్తూ.. విద్యా వ్యవస్థ ముసుగులో విద్యార్థుల్ని తీవ్రవాదులుగా తయారు చేస్తుంటాడు. వాళ్ల సాయంతో పెద్ద ఎత్తున మారణహోమం సృష్టించి భారత్‌ను నాశనం చేయాలని ప్రణాళిక రచిస్తుంటాడు. దీనికోసం కేంద్రమంత్రి సీతారామరాజు (సుమన్) సోదరుడైన బాచిరాజు (సునీల్) సాయం తీసుకుంటాడు. కానీ, తన ఉగ్రచర్యల సంగతి సీతారామరాజుకు తెలియడంతో బాచిరాజుతో కలిసి అతన్ని జలాలుద్దీన్ కిరాతకంగా చంపేస్తాడు. ఈ హత్యను దర్శన అనే ఓ చిన్న పాప చూస్తుంది. దీంతో ఆ పాపను కూడా చంపాలని బాచిరాజుతో చెప్పి ఓ పని మీద కశ్మీర్‌కు వెళ్తాడు జలాలుద్దీన్. అయితే బాచిరాజు ముఠా ఆ పాపను చంపబోగా ఆ చిన్నారి కుటుంబానికి గోపిరెడ్డిగా పరిచయమైన విశ్వం (గోపీచంద్) కాపాడతాడు. శ్రీను వైట్ల చిత్రాల్లో కథలు ఓ థీమ్‌లో సాగుతుంటాయి. దేశానికి కొన్ని విద్రోహ శక్తుల నుంచి ముప్పు ఏర్పడటం.. ఆ కుట్రల్ని భగ్నం చేసేందుకు హీరో తన ఐడింటిటీని దాచి పెట్టి మారుపేరుతో ఓ ఇంటిలో చేరి రహస్యంగా మిషన్‌ను చేపట్టడం.. ఈ క్రమంలో తన తెలివితేటలతో ఆ విద్రోహ శక్తుల్ని తన ట్రాప్‌లో పడేలా చేసి వాళ్ల ఆట కట్టించడం కనిపిస్తుంటుంది. శ్రీను వైట్ల నుంచి వచ్చిన 'దూకుడు', 'బాద్‌షా' చిత్రాలు ఈ కోవకు చెందినవే. ఈ థీమ్ రొటీన్‌గా మారిపోవడంతో శ్రీనుకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. అందుకే ఈసారి తన పంథాను పూర్తిగా మార్చుకుని.. ఈతరం ప్రేక్షకులు కోరుకునే కొత్తదనం నిండిన కథతో 'విశ్వం'ను సిద్ధం చేసినట్లు ప్రచార కార్యక్రమాల్లో చెప్పారు. కానీ, తెరపై సినిమా చూస్తున్నప్పుడు ఆయన ఇంకా తన పాత పంథా నుంచి అసలు బయటకు రాలేదనే అనిపిస్తుంది. ఈ చిత్రాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే 'దూకుడు'కు గోపీచంద్ వెర్షన్‌లా ఉంటుంది. మహేశ్‌బాబు 'దూకుడు'లో తండ్రి ఎమోషన్‌ను కనిపిస్తే.. ఇందులో ఓ పాప ఎమోషన్ కీలకంగా నిలుస్తుంది. మిగతాదంతా శ్రీను వైట్ల మార్క్ వినోదం.. గోపీచంద్ శైలి యాక్షన్ హంగామాతో రొటీన్‌గానే సాగిపోతుంది. ద్వారకలో జరిగే బాంబు బ్లాస్ట్ ఎపిసోడ్‌తో సినిమా ఆసక్తికరంగా మొదలవుతుంది. ఆ వెంటనే జలాలుద్దీన్ పాత్రను పరిచయం చేసి నేరుగా కథలోకి తీసుకెళ్లిపోయారు దర్శకుడు. కథలో సీరియస్‌నెస్ మిస్సయి పోతుంది. ఇక్కడి నుంచి శ్రీను వైట్ల మార్క్ వినోదం మొదలవుతుంది. జాలిబాబుగా పృథ్వీ చేసే అల్లరి.. మ్యారేజ్ బ్రోకర్‌గా శ్రీనివాస్ కామెడీ ట్రాక్ ప్రేక్షకులకు నవ్వులు పంచుతాయి. ఇక నాయకా నాయికల మధ్య వచ్చే ఇటలీ లవ్‌ట్రాక్ ఎపిసోడ్ బోరింగ్‌గా అనిపిస్తుంది. పాపను చంపేందుకు బాచిరాజు మళ్లీ కుట్ర మొదలు పెట్టినప్పటి నుంచి కథలో సీరియస్‌నెస్ మొదలవుతుంది. ఈ క్రమంలో గోవా నేపథ్యంలో వచ్చే యాక్షన్ సీక్వెన్స్‌తో విరామమిచ్చిన తీరు ఆసక్తిరేకెత్తిస్తుంది. గోపీచంద్ ఎప్పటిలాగే తనకు అలవాటైన యాక్షన్ పాత్రలో చక్కగా ఒదిగిపోయారు. యాక్షన్, కామెడీ సీక్వెన్స్‌లలో తనదైన శైలిలో చెలరేగిపోయారు. కావ్య థాపర్ తెరపై తన అందచందాల తో గ్లామర్‌గా కనిపించింది. తన పాత్ర నిడివి కూడా ఎక్కువగా ఉంటుంది. డ్యాన్సుల్లో ప్రతిభ చూపే అవకాశం దొరికింది. కాకపోతే నటన పరంగా ప్రతిభ చూపించుకునే ఛాన్స్ దొరకలేదు. ప్రధాన ప్రతినాయకుడిగా జిషు సేన్ గుప్తా అలవాటైన విలనిజంతో ఆకట్టుకున్నాడు. సునీల్‌ను ఒకటి రెండు సీన్స్ మినహా ఆద్యంతం కామెడీ విలన్‌గానే చూపించారు. ఈ కథకు కీలకమైన దర్శన పాత్రను పోషించిన చిన్నారి చక్కటి నటనతో ఆకట్టుకుంది. నరేశ్, ప్రగతి, వెన్నెల కిషోర్, పృథ్వీ, వీటీవీ గణేశ్‌, అజయ్ ఘోష్.. ఇలా బోలెడంత మంది కమెడియన్లు కనిపించారు. వీరిలో ప్రతి ఒక్కరూ వాళ్ల పాత్ర పరిధి మేరకు నవ్వించే ప్రయత్నమే చేశారు. కమర్షియల్ డైరెక్టర్‌గా శ్రీను వైట్ల ప్రతిభకు వంక పెట్టాల్సిన పనిలేదు. కాకపోతే తన రొటీన్ కమర్షియల్ ఫార్మాట్ నుంచి బయట పడటం లేదు. రచయిత గోపీమోహన్ కూడా ఒకే థీమ్‌ను పట్టుకుని బండి నడిపిస్తున్నట్లు అనిపిస్తోంది. కథ.. కథనాల్లో కొత్తదనం చూపించలేకపోతున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం పర్వాలేదనిపిస్తుంది. భీమ్స్ చేసిన 'గుంగురూ గుంగురూ' పాట మాస్ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. విజువల్స్ గ్రాండ్‌గా ఉంటాయి. ఇలాంటి రొటీన్ కథను నమ్మి భారీగా ఖర్చు పెట్టిన నిర్మాతల సాహసాన్ని మెచ్చుకోవాలి.

# దేవర-2 మరికొందరు బాలీవుడ్ స్టార్స్




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దేవర'ఇటీవల విడుదలై మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీని సీక్వెల్‌కు సంబంధించిన అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఈ సీక్వెల్‌లో మరికొందరు బాలీవుడ్ స్టార్స్ ఉండే అవకాశం ఉందన్నారు. ఇది జరుగుతుందో, లేదో నాకు తెలియదు కానీ.. 'దేవర2'లో రణ్‌వీర్ సింగ్, రణ్‌బీర్ కపూర్ ఉంటే బాగుంటుంది. ఇది నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ఇది జరుగుతుందో, లేదో తెలియకుండా నేను ఎక్కువ వివరాలు పంచుకోకూడదు. తెలుగు, తమిళ ఇండస్ట్రీలకు చెందిన నటీనటుల పేర్లు చెబితే ఇప్పటినుంచే ఊహాగానాలు మొదలవుతాయి. 'దేవర2'లో అతిథి పాత్రలు కూడా ఉంటాయి. అవి సినిమాలో చాలా కీలకమైనవి. అతి త్వరలోనే వాటి వివరాలు ప్రకటిస్తాను అని కొరటాల శివ అన్నారు.'దేవర 2'పై కొరటాల ఎప్పటికప్పుడు అంచనాలు పెంచేస్తున్నారు.

మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని ఇటీవల వెల్లడించారు. పార్ట్ 1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుందని చెప్పారు .ఎన్టీఆర్ కూడా ఈ సీక్వెల్ గురించి మాట్లాడుతూ.. మొదటి భాగం విజయం సాధించడంతో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'దేవర' కంటే దాని సీక్వెల్ ఇంకా బాగుంటుందన్నారు.

# పట్టాలకు ఎక్కని వేణు మూవీ


### - దిల్‌రాజ్ దయతలిస్తేనే ముందుకు




నటుడిగా, కామెడీయన్‌గా మంచి గుర్తింపు పొందిన ఆర్టిస్ట్ వేణు యేల్దండి. జబర్దస్త్ షోతో స్టార్ కామెడీయన్‌గా ఎదిగిన వేణు.. 'బలగం' సినిమా తీసి అందరిని ఆశ్చర్యపరిచాడు. తెలంగాణ మాండలికం, ఎమోషనల్ స్టోరీ నేరేటివ్‌తో తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలని కట్టిపడేసాడు. దీంతో ఆయన నెక్స్ట్ సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సినిమా రిలీజై రెండేళ్లవుతున్నా.. ఇంకో ప్రాజెక్ట్ షూట్ ప్రారంభించకపోవడంతో అసలేమైందని చర్చ జరుగుతోంది. కథను ఇప్పటికే ఇద్దరు స్టార్ హీరోలకు నేరేట్ చేసిన వాళ్ళమేన్నారు.. ప్రొడ్యూసర్ దిల్ రాజు ఏమన్నాడంటే.. వేణు యేల్దండి.. తన బలగం సినిమాతో తెలుగు సినీ ఇండస్ట్రీలో సంచలనమే సృష్టించాడు. ఈ సినిమాకి ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన దిల్ రాజే నెక్స్ట్ సినిమాకి కూడా కమిట్మెంట్ ఇచ్చాడు. దీంతో 'ఎల్లమ్మ' కథ ఆధారంగా వేణు ఒక స్క్రిప్ట్ కూడా రెడీ చేసుకున్నాడు. మొదట ఈ స్టోరిని నేచురల్ స్టార్ నాని కి నేరేట్ చేసినట్లు వార్తలొచ్చాయి. అయితే కథ నచ్చకో, డేట్స్ కాళీలేకో నాని ఈ సినిమాని యాక్సెప్ట్ చేయలేదని టాక్ వినపడింది. బేసిక్‌గా ప్రయోగాత్మక, ఉత్తమ కథాదీరిత సినిమాలు చేసే నాని ఇలా చేశాడేంటని అంతా అనుకున్నారు. దీంతో వేణు ఈ కథను హీరో నితిన్‌కి వినిపించారట. స్టోరీ నచ్చిన నితిన్ ఈ ప్రాజెక్ట్ ఓకే చేశాడని కూడా సినీ వర్గాల్లో టాక్. బేసిక్‌గా దిల్ రాజు ప్రొడక్షన్ అంటే నితిన్ నో చెప్పే ఛాన్సే లేదంటున్నారు. ఇదిలా ఉండగా గురువారం జరిగిన ఓ సినిమా మీటింగ్‌కి డైరెక్టర్ వేణుతో పాటు నిర్మాత దిల్ రాజు కూడా అటెండ్ అయ్యాడు. ఈ నేపథ్యంలో దిల్ రాజు మాట్లాడుతూ.. ' ఏం వేణు ఎల్లమ్మ కథ ఎప్పుడు మొదలు పెడుతున్నావు' అని ప్రశ్నించాడు. దీనికి వేణు స్పందిస్తూ.. మీరెప్పుడంటే అప్పుడే సార్ అన్నారు. ఈ నవంబర్‌లో షూట్ స్టార్ట్ చేద్దామా అన్నారు.

# హీరోయిన్‌తో ప్రేమలో పడ్డ నారా రోహిత్

తొలి సినిమా 'బాణం'తోనే ప్రేక్షకులని ఆకట్టుకున్న హీరో నారా రోహిత్. ప్రతినిధి సినిమాతో ఆడియెన్స్‌కి మంచి కిక్కిచ్చిన రోహిత్.. ఆ మూవీ సీక్వెల్ ప్రతినిధి 2తో మాత్రం నిరాశపరిచాడు. ఇదంతా పక్కన పెడితే ఇండస్ట్రీలోని మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్స్‌లో రోహిత్ ఒకరు. తాజాగా ఆయన పెళ్ళికి సంబంధించిన అప్డేట్ ఒకటి సందడి చేస్తుంది. అది కూడా ఒక హీరోయిన్‌ని ప్రేమించి పెళ్లిచేసుకోనున్నట్లు సమాచారం. సాక్షాత్ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తమ్ముడి కుమారుడైన రోహిత్ ఇండస్ట్రీలో మంచి సినిమాలతో ఫర్వాలేదనిపిస్తునాడు. భారీ హిట్లు లేకపోయినా డిజాస్టర్ కథలు కూడా తీయకపోవడంతో కెరీర్ సాఫీగానే సాగుతోంది. అయితే వయసు మాత్రం నాలుగు పదులు దాటడంతో పెళ్లి చేసేయాలని నారా ఫ్యామిలీ ఫిక్స్ అయిపోయిందంట. అంతే కాదు త్వరలోనే పెళ్ళికి ముహర్తం కూడా ఫిక్స్ చేశారు. ఈ నెల 13నే ఎంగేజ్మెంట్. ప్రతినిధి 2 సినిమాలో హీరోయిన్‌గా చేసిన 'సిరి' ని రోహిత్ ప్రేమించాడట. ఈ జంట పెళ్లి చేసుకోవడానికి కూడా సిద్దపడటంతో వధువుని ప్రత్యేకంగా వెతికే పని లేకుండా చేశావు అంటూ నారా ఫ్యామిలీ ఖుషి అవుతోంది.




ప్రస్తుతం ఈయన ప్రతినిధి 2 సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతుంది. టీజర్, ట్రైలర్‌లతోనే మంచి హైప్ తెచ్చుకున్న ఈ మూవీ కొన్నాళ్లు చర్చల్లో బాగా నిలిచింది. అయితే సీఎం మరణం.. అతని కొడుకుని సీఎం చేయాలని పట్టుబట్టడం.. సంక్షేమ పథకాలపై సెటర్లు.. అభివృద్ధి జరగలేదనే విమర్శలు.. ఇవన్నీ అధికార వైసీపీ పార్టీకి కనెక్ట్ అయ్యే అంశాలుగా ఉన్నా.. కథ పరంగా ఆ పార్టీని కెలికే ప్రయత్నం అయితే చేయలేదు. కేవలం సీఎం మర్డర్ మిస్టరీ చుట్టూ పొలిటికల్ డ్రామా మాత్రమే చూపించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY NALAM SHASHIDHAR, PRINTING AT SHARADHA PRINTERS #3-6-194, SHASTRI ROAD, KARIMNAGAR-505001.
PUBLISHED FROM #9-9-95/1, RAMNAGAR, KARIMNAGAR DISRICT, TELANGANA STATE, PIN-505001, Email id: tgktelugudaily@gmail.com, Editor : NALAM SHASHIDHAR, RNI NO: TELTEL/2014/54796, CELL: 91-9951242422.